మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 13-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 | సంచిక: 314 Issue: 314

13 మే 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:48 సూర్యాస్తమయం - సా. 6:36 తిథి ఏకాదశి మ. 1:24 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర రా. 12:04౦ వరకు తరువాత రేవతి యోగం విష్కంభ రా. 8:49 వరకు కరణం భాలవ మ. 1:24 వరకు కౌలవ రా. 12:26౦ వరకు వర్జ్యం ఉ. 10:29 నుండి మ. 12:01 వరకు దుర్ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:38 వరకు రాహుకాలం మ. 12:12 నుండి మ. 1:48 వరకు యమగండం ఉ. 7:24 నుండి ఉ. 9:00 వరకు గుళికాకాలం ఉ. 10:36 నుండి మ. 12:12 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:12 నుండి తె. 5:00 వరకు అమృత ఘడియలు రా. 7:19 నుండి రా. 8:51 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## ఈ ఏడాది జీడీపీ 6 శాతమే

### మూడీస్ రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ, మే 12 : ఈ ఏడాదికిగాను భారత ఆర్థిక వృద్ధిరేటు అంచనాకు ప్రముఖ గ్లోబల్ క్రెడిట్ రేటింగ్స్ ఏజెన్సీ మూడీస్ కోత పెట్టింది. 0.8 శాతం పడిపోయి 6 శాతానికే పరిమితం కావచ్చని మంగళవారం అంచనా వేసింది. అధిక ఇంధన ధరల నేపథ్యంలో మందగించిన వినిమయం, -2 వ పేజీలో...



## ప్రభుత్వ బ్యాంకులకు లాభాలే లాభాలు

న్యూఢిల్లీ: దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయి లాభాలను నమోదు చేశాయి. రూ.1.98 లక్షల కోట్లతో పీఎస్‌బీలు వరుసగా నాలుగో ఏడాది మెరుగైన లాభాలను కొనసాగించాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, మెరుగైన ఆస్తుల నాణ్యత, బలమైన రుణ వృద్ధి, అధిక వడ్డీ ఆదాయం వంటి అంశాలు -2 వ పేజీలో...




## రూపాయి గింగిరాలు

### 95.68కి జారుకున్న విలువ

ముంబై: రూపాయి మారకం విలువ పాతాళంలోకి జారుకుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మంగళవారం మరో 40 పైసలు కోల్పోయి చారిత్రక-2 వ పేజీలో...



## ఏపీకి 10, టీజీకి 22

### కృష్ణా జలాలపై కేఆర్ఎంబీ కీలక నిర్ణయం

హైదరాబాద్, మే 12 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల తాగు నీటి అవసరాల మేరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పచ్చజెండా ఊపింది. ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 6 టీఎంసీలు తరువాయి 2 వ పేజీలో...

# నీట్ 2026 ..గలీజ్




నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేశారు. మే 3వ తేదీన నిర్వహించిన ఆ పరీక్షను రద్దు చేసినట్లు ఇవాళ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. అయితే నీట్ పరీక్షకు చెందిన కొత్త తేదీలను త్వరలో వెల్లడించనున్నట్లు ఎన్‌టీఏ పేర్కొన్నది. దేశవ్యాప్తంగా మెడిసిన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ యూజీ 2026 పరీక్ష నిర్వహించారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 552 నగరాలు, 14 అంతర్జాతీయ కేంద్రాల్లో కలిపి సుమారు 20 లక్షల మందికి పైగా విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరయ్యారు. అయితే 3న నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) పేపర్ లీక్ అయినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి.

### పరీక్ష రద్దు.. తర్వలో కొత్త తేదీ

### లీక్ ఆరోపణలతో నిర్ణయం

న్యూఢిల్లీ: నీట్ పరీక్షలో విద్యార్థులు ఎదుర్కొన్న ప్రశ్నలను పోలిన 100 ప్రశ్నలు పరీక్ష జరగడానికి ముందే సర్క్యులేట్ అయినట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై రాజస్థాన్ పోలీసులు విచారణ చేపట్టారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఎగ్జామ్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పరీక్షలను రద్దు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ కోసం ఈ కేసును సీబీఐకి అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టింది. అయితే కొత్తగా విద్యార్థుల రిజిస్ట్రేషన్ అవసరం లేదని ఎన్టీఏ చెప్పింది. అదనపు ఎగ్జామ్ ఫీజు కూడా అవసరం లేదని వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్ డేటా, ఎగ్జామ్ సెంటర్లను యథావిధిగా కొనసాగించనున్నారు. గతంలో విద్యార్థులు చెల్లించిన ఫీజులను తిరిగి రిఫండ్ చేయనున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. విద్యార్థుల ప్రయోజనం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన ప్రెస్ రిలీజ్‌లో ఎన్‌టీఏ పేర్కొన్నది. జాతీయ పరీక్ష విధానంపై నమ్మకం సడలకుండా ఉండేందుకు మళ్లీ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఎన్‌టీఏ చెప్పింది. ఇదితరువాయి 2 వ పేజీలో...



## అంజన్న ఆనందం!

### కొండగట్టు కాషాయమయం.. వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కొండగట్టు ఆంజనేయ స్వామి టెంపుల్ లో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన హనుమాన్ జన్మోత్సవాలు (పెద్ద హనుమాన్ జయంతి) మంగళవారం ఘనంగా ముగిశాయి. వైశాఖ మాసాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ మహోత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్యాల, మే 12 (ఈవార్తలు): ఆలయ ప్రాంగణం అంతా భక్తిజన సందోహంతో కళకళలాడింది. వేదఘోషలు, మంత్రోచ్చారణలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఉత్సవాలు మే 9న శనివారం సాయంత్రం యాగశాల శుద్ధి, పుణ్యాహవచనం, అంకురార్పణ, అఖండ దీపస్థాపన కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. అర్చకులు శాస్త్రోక్తంగా యాగశాల కార్యక్రమాలను -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,398 |
| వెండి (కిలో): | రూ.3,00,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,432 |



## హమాలీ చార్జీలు పెంపు

### రూ.6.50 నుంచి రూ.8.50కు పెరుగుదల

### ధాన్యం సేకరణలో నిర్లక్ష్యాన్ని సహించను

### కొన్న వెంటనే గోదాములకు తరలాలి

### అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్, మే 12 (ఈవార్తలు): తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో గత కొన్ని రోజులుగా ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. రైతులు పండించిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని.. అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసిపోవడం, కొట్టుకుపోవడం జరుగుతోందని ఆరోపిస్తున్నాయి. వీటికి సంబంధించిన వీడియోలు కూడా మీడియా, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన అంశంపై మంగళవారం రోజున అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం తరువాయి 2 వ పేజీలో...



## బీఆర్ఎస్ డిజిటల్ మెంబర్‌షిప్

### ప్రతి నియోజకవర్గానికి రాష్ట్ర కమిటీ సమన్వయకర్త.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయాలు

సిద్దిపేట, మే 12 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో మంగళవారం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శుల సమావేశం జరిగింది. దాదాపు ఆరు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు, వోటర్ లిస్టు సవరణ తదితర కార్యాచరణ మొత్తం డిజిటల్ ప్రక్రియలో జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సభ్యత్వాన్ని కూడా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డిజిటలైజేషన్ పద్ధతిలో జరపాలని ఈ సమావేశంలో నేతలు అభిప్రాయపడ్డారు. ప్రతి నియోజకవర్గానికి, రాష్ట్ర కమిటీ నుంచి సభ్యత్వ తరువాయి 2 వ పేజీలో...

## ముందే నైరుతి ఆగమనం

న్యూఢిల్లీ: వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. నైరుతి రుతు పవనాలు ఈ వారం చివరినాటికి బంగాళాఖాతం , అండమాన్, నికోబార్ సమీప ద్వీపాలకు చేరుకుంటాయని తెలిపింది. ఇందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. సాధారణంగా మే 20 నాటికి అండమాన్, నికోబార్ దీవులకు చేరుకుంటాయి. అనంతరం దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. జూన్ 1న కేరళను తాకుతాయి. భారత ఉపఖండంలో నాలుగు నెలల వర్షాకాలం ప్రారంభానికి దీనిని సూచికగా భావిస్తారు.

## విశ్వవాణి




కిమ్ జోంగ్ ఉన్ హత్యకు గురైతే స్వయంచాలకంగా అణు దాడిని ప్రేరేపించే డెడ్ మ్యాన్స్ స్విచ్‌ను ఉత్తర కొరియా తన రాజ్యాంగంలో చేర్చింది. 2026 మార్చిలో ప్యోంగ్యాంగ్‌లో జరిగిన సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ సమావేశంలో ఈ మార్పును ఆమోదించారు. కిమ్ జోంగ్ ఉన్ హత్యకు గురైనా లేదా దేశ అణు కమాండ్ వ్యవస్థ నిర్వీర్యం అయినా ఎటువంటి ఆలస్యం లేకుండా స్వయంచాలకంగా అణు దాడిని ప్రారంభించాలని ఈ సవరణ పేర్కొంది.



## జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, మే 12 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పేందుకు రెడీ అయింది. రాష్ట్రంలోని పేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో తీసుకువచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా ప్రకటించారు. జూన్ 2వ తేదీన తరువాయి 2 వ పేజీలో...



## సినిమా టికెట్ రేట్లు పెంచం

### తెలంగాణ ఎగ్జిబిటర్ల నిర్ణయం

హైదరాబాద్, మే 12 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎగ్జిబిటర్ల అసోసియేషన్ మంగళవారం ఒక అత్యవసర సమావేశం నిర్వహించింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమ భవిష్యత్తుపై ఈ భేటీలో సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. ప్రధానంగా ఐదు అంశాల చుట్టూ ఈ సమావేశం సాగింది. చివరగా పర్సంటేజీల విధానంపై ఒక స్పష్టమైన తరువాయి 2 వ పేజీలో...



## పెట్రో బాదుడు తప్పదేమో!

### ఆర్థిక ఒత్తిడికి చర్యలు తప్పవు

### కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ

ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కీలక అప్‌డేట్ వచ్చేసింది. ప్రపంచ యుద్ధం కొనసాగితే, ఆర్థిక ఒత్తిడిని తగ్గించడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవలసి రావచ్చని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేర్కొన్నారు. న్యూఢిల్లీ వేదికగా మంగళవారం జరిగిన ప్రతిష్టాత్మక 'సీఐఐ వార్షిక బిజినెస్ సమ్మిట్ 2026'లో మంత్రి పాల్గొని ఈ అంశాలపై సుదీర్ఘ ప్రసంగం చేశారు.

న్యూఢిల్లీ: గత నాలుగేళ్లుగా దేశంలో పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచలేదనే వాస్తవాన్ని ఆయన ఈ సందర్భంగా అందరికీ గుర్తుచేశారు. ఇంధన ధరల పెంపు అనేది చివరి సారిగా 2022లో మాత్రమే జరిగిందని, ఆ తర్వాత సామాన్య ప్రజలపై ఎలాంటి అదనపు భారం వేయలేదని స్పష్టం చేశారు. "ఎన్నికలు పూర్తి అవ్వగానే ఇంధన ధరలు భారీగా బాదుతారు అని చాలా మంది అనవసరంగా విమర్శిస్తున్నారు. అయితే గడచిన తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

13.5.2026

మేషం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో శుభకార్య విషయమై చర్చలు జరుగుతాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. నూతన వ్యాపారాలు విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

వృషభం: చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. ఉద్యోగస్తులు అధికారుల ఆగ్రహానికి గురికావల్సి వస్తుంది. సంతాన ఆరోగ్య విషయాలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

మిధునం: గృహమున గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులలో జాప్యం తప్పదు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది.

కర్కాటకం: చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. బంధుమిత్రులతో గృహమున సంతోషంగా గడుపుతారు. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు లభిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ పనితీరుతో అందరినీ ఆకట్టుకుంటారు.

సింహం: చిన్ననాటి మిత్రులతో స్వల్ప విభేదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందగిస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఇంటాబయటా చికాకులు పెరుగుతాయి. ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది.

కన్య: దీర్ఘకాలిక ఋణ సమస్యల నుండి బయటపడతారు. చేపట్టిన వ్యవహారాలలో ఆకస్మికంగా విజయం సాధిస్తారు. గృహమున బంధు మిత్రులతో ఆనందంగా గడుపుతారు. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

తుల: వృధా ఖర్చులు పెరుగుతాయి. నూతన ఋణయత్నాలు చేస్తారు. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. చేపట్టిన పనులలో అధిక శ్రమతో అల్ప ఫలితాలు పొందుతారు. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. కుటుంబ సభ్యులతో దీర్ఘకాలిక వివాదాలు పరిష్కారమవుతాయి. నూతన వ్యక్తుల పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఉంటాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి.

ధనస్సు: నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు లభిస్తాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో దైవదర్శనాలు చేసుకుంటారు. ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది.

మకరం: చేపట్టిన పనులు వ్యయప్రయాసలతో కానీ పూర్తికావు. బంధువర్గంతో అకారణంగా మాటపట్టింపులు కలుగుతాయి. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. వ్యాపార వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేసి నష్టాలు ఎదుర్కొంటారు. ఉద్యోగమున గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

కుంభం: సన్నిహితులతో కొన్ని వ్యవహారాలలో మాట పట్టింపులు కలుగుతాయి. ఆర్థికపరంగా ఒడిదుడుకులు అధికం అవుతాయి. ఇంటా బయట బాధ్యతలు మరింత చికాకు కలిగిస్తాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగ యత్నాలు ముందుకు సాగక నిరాశకలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో స్వల్ప నష్ట సూచనలున్నవి.

మీనం: మిత్రుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. కొన్ని సంఘటనలు ఆశ్చర్యం కలిగిస్తాయి.

# నీట్..గలీజ్

మొదటి పేజీ తరువాయి

విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు ఇబ్బందిని కలిగించే అంశమే, కానీ జరిగిన పరిణామాల దృష్ట్యా మళ్లీ పరీక్ష నిర్వహించడమే ఉత్తమం అని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఎన్ఏటీ పేర్కొన్నది. ఒకవేళ ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్తే అప్పుడు నష్టం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ఎన్టీఏ చెప్పింది. పరీక్ష తేదీ, అడ్మిట్ కార్డుకు సంబంధించిన అంశాల కోసం అధికారిక సమాచారాన్ని మాత్రమే ఫాలోకావాలని, సోషల్ మీడియాలో ప్రచారం అయ్యే అంశాలను పట్టించుకోవద్దు అని ఎన్టీఏ తెలిపింది.

పాలకుల చేతగానితనం: కేటీఆర్

'పాలకుల అసమర్థ, చేతకానితనంతో పేపర్లు లీక్ అవుతున్నాయి. తమ ఏలుబడిలో పదేపదే నీట్ ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నా, పాలకులకు కనీసం చీమ కుట్టినట్టైనా వుండడం లేదు. ఇదేమీ గట్టిగా నిలదీసే రాజకీయ పార్టీలు కూడా కరువయ్యాయి' అని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గట్టిగా నిలదీయడం ప్రశంసలు అందుకుంటోంది. నీట్ ప్రశ్నాపత్రం లీకై, పరీక్ష రద్దు చేయాల్సిన దుస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని కేటీఆర్ విమర్శించారు. పగలూరాత్రి కష్టపడి చదివిన ఎంతో మంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం చేతకాని ఎన్డీఏ ప్రభుత్వ వైఫల్యం వల్లే మరోసారి పేపర్ లీకైందని కేటీఆర్ ఆరోపించారు. 2024లో నీట్ ప్రశ్నాపత్రం లీకైందని, దాని నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడం వల్లే మళ్లీ అదే దుర్మార్గం పునరావృతం అయ్యిందని ఆయన మండిపడ్డారు. అసమర్థుల తప్పులు విద్యార్థుల పాలిట శాపంగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది నీట్ పరీక్ష రాసిన దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కేంద్ర సర్కారు తీవ్ర మానసిక క్షోభకు గురి చేసిందని ఆయన పేర్కొన్నారు. దీని వెనక ఎంత పెద్దవాళ్ల హస్తం ఉన్నా, కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కేటీఆర్ కోరారు. అలాగే నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మోదీ సర్కార్ క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## సినిమా టికెట్ రేట్లు పెంచం

మొదటి పేజీ తరువాయి

నిర్ణయానికి వచ్చారు. ఈ సందర్భంగా నిర్మాత శిరీష్ ఒక సంచలన ప్రకటన చేస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ల ధరలు అస్సలు పెంచకూడదని వారు ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు. సాధారణంగా పెద్ద సినిమాలు వచ్చినప్పుడు ప్రభుత్వం రేట్లు పెంచుకునే వెసులుబాటు కల్పిస్తుంది. కానీ, ప్రభుత్వం అటువంటి జీఓలు ఇచ్చినా కూడా తాము మాత్రం ధరలను పెంచబోమని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు. సామాన్య ప్రేక్షకులకు ఇది ఒక రకమైన హామీ అని వారు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని సింగిల్ స్క్రీన్లకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. మల్టీప్లెక్స్‌లకు వెళ్లలేని పేద, మధ్యతరగతి ప్రజలకు సినిమా వినోదాన్ని చేరువ చేయడమే దీని అసలు ఉద్దేశం. టికెట్ రేట్లు పెరిగితే సామాన్యుడు థియేటర్లకు రావడం మానేస్తాడని, అది వ్యవస్థకే ప్రమాదమని వారు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం సింగిల్ స్క్రీన్లు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయి. నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తమ థియేటర్లను గోడౌన్లకు అద్దెకు ఇస్తే వచ్చే ఆదాయం చాలా ఎక్కువగా ఉంటుందని ఎగ్జిబిటర్ నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సినిమా పట్ల ఉన్న మక్కువతోనే నష్టాలు వచ్చినా హాల్స్ నడుపుతున్నామని ఆయన వెల్లడించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో నిర్మాతలే తమను ఆదుకోవాలని, పర్సంటేజీల విషయంలో వెనక్కి తగ్గాలని కోరారు.

## అంజన్న ఆనందం!

మొదటి పేజీ తరువాయి

నిర్వహించగా భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మే 10వ తేదీన ఉదయం భద్రాచల శ్రీరామచంద్రస్వామి ఆలయం నుండి వచ్చిన శేష వస్త్రములను ఘనంగా ఎదుర్కొన్నారు. అనంతరం స్వస్తి వాచనం, రక్షాబంధనం, ఋత్విక్ వరణం, అరుణి మథనం, దేవతాహ్వానం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, హవన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకాలు, సహస్రనామార్చనలు, పారాయణాలు, నైవేద్యాలు ఘనంగా జరిగాయి. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, సుందరకాండ పారాయణం, అమ్మవారి సహస్రనామ కుంకుమార్చన, బలిహరణం, మహానివేదనం నిర్వహించగా అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మే 11వ తేదీన స్థాపిత దేవతారాధన, హోమం, సుందరకాండ పారాయణం, పంచామృతాభిషేకం, సహస్రనామార్చనలు, మహానివేదన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, అమ్మవారి కుంకుమార్చన, పుష్పాలతో సహస్రనామార్చన, హోమం, బలిహరణం కార్యక్రమాలు నిర్వహించారు. మే 12వ తేదీ మంగళవారం శ్రీ స్వామివారి జయంతి సందర్భంగా తెల్లవారుజామునే తిరుమంజన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ద్రావిడ ప్రబంధ పారాయణాలు, విశేష అభిషేకాలు, తులసీ అర్చన, పట్టు వస్త్రాల అలంకరణ, సహస్రనాగవల్లి అర్చనలు వైభవంగా నిర్వహించారు. అనంతరం హోమం, మహాపూర్ణాహుతి, స్నపన తిరుమంజనం, ఉయ్యాల సేవ కార్యక్రమాలు నిర్వహించగా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. సామూహిక భజనలు, మంత్రపుష్పం, మహానివేదనం అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. సాయంత్రం ఆరాధన కార్యక్రమాలతో పాటు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, అమ్మవారి కుంకుమార్చన, ఓడిబియ్యం, సహస్ర దీపాలంకరణ, గరుడవాహన సేవ, కంకణోద్వాసన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గరుడవాహన సేవలో స్వామివారి ఉత్సవమూర్తులను దర్శించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మహాదాశీర్వాదం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీ స్వామివారి జన్మోత్సవాల సందర్భంగా ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి వేదోక్త ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

మొదటి పేజీ తరువాయి

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీని ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే గృహ నిర్మాణ శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి.. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి సంబంధించిన విధివిధానాలను ఈనెల 21వ తేదీన జరిగే తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు రెడీ చేయాలని సంబంధిత అధికారులను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ఇక ఇప్పటివరకు పంపిణీ చేయకుండా పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో హైదరాబాద్‌లో భూములు ఉన్నవారికి.. ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ సర్కార్.. దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించడం వల్ల అవి నిరుపయోగంగా మారిపోయాయని.. అందుకే అలాంటి పొరపాట్లు తాము చేయకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పేదలు నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని స్థలాలను ఎంపిక చేసి.. తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తైన, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లకు ఈ నెలాఖరు నాటికి లబ్ధిదారులను గుర్తించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఆ ఇళ్లకు 5 నుంచి 8 కిలోమీటర్ల లోపు ఉన్న వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని తేల్చి చెప్పారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తైన ఇళ్లలో లబ్ధిదారులు మాత్రమే ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ ఇళ్లకు తాగునీరు, డ్రైనేజి, కరెంట్ వంటి మౌలిక వసతులను కల్పించేందుకు వేగంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ పరిధిలో ఇళ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్ధిదారులకు.. ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించాలని సంబంధిత అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు జారీ చేశారు. ఇక ప్రభుత్వ భూములను ఆక్రమించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యూఎల్‌సీ భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ.. నిబంధనలను అతిక్రమించి కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని.. ఈ సమావేశంలోనే స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి.. మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో తక్షణమే సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

## ఏపీకి 10, టీజీకి 22

మొదటి పేజీ తరువాయి

వాడుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతించింది. హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో ఈ మేరకు అంగీకారం కుదిరింది. సాగర్‌లో ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీల నీటిని కేటాయించగా, తెలంగాణకు సాగర్ నుంచి 16 టీఎంసీలు, శ్రీశైలం నుంచి 6 టీఎంసీల చొప్పున మొత్తం 22 టీఎంసీలను వినియోగించుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతించింది. సమావేశంలో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ నర్సింహమూర్తి పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణ అధికారులు ఏపీ ఇప్పటికే ఎక్కువ నీటిని వాడుకుందని ప్రస్తావించారు

## ఈ ఏడాది జీడీపీ 6 శాతమే

మొదటి పేజీ తరువాయి

పెట్టుబడులు, పారిశ్రామిక కార్యకలాపాలు.. జీడీపీ వృద్ధిని దెబ్బతీస్తున్నాయని ఈ నెలకుగాను విడుదల చేసిన ప్రపంచ స్థూల ఆర్థిక ముఖచిత్రం అప్‌డేట్‌లో పేర్కొన్నది. 'అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిస్థాయిలో అమలుకాకపోవడం.. ప్రపంచ ఆర్థిక అనిశ్చిత పరిస్థితులకు కారణమవుతున్నది. ఈ క్రమంలోనే భారత జీడీపీ ఈ ఏడాది 0.8 శాతం క్షీణించవచ్చు' అని మూడీస్ తెలిపింది. వచ్చే ఏడాదికిగాను అర శాతం తగ్గి 6 శాతంగానే దేశ జీడీపీ నమోదు కావచ్చన్నది. అయితే మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితులు చక్కబడితే భారత ఆర్థిక వ్యవస్థ కోలుకోవచ్చన్నది.

## రూపాయి గింగిరాలు

మొదటి పేజీ తరువాయి

కనిష్ఠ స్థాయి 95.68కి జారుకున్నది. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో అలజడికి కారణమైందని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. పశ్చిమాసియాలో పది వారాలుగా కొనసాగుతున్న యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాను మరింత కఠినతరం చేస్తున్నదన్న భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయని తెలిపారు. అమెరికా మద్దతు ఉన్న శాంతి ప్రతిపాదనపై టెహ్రాన్ ఇచ్చిన తాజా స్పందనను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పూర్తిగా ఆమోదయోగ్యం కాదని తిరస్కరించిన తర్వాత ఆ భయాలు మరింత పెరిగాయి. వీటికి తోడు చమురు వినియోగం తగ్గించడంతోపాటు బంగారం కొనుగోళ్లు నిలిపివేయాలని ప్రధాని సూచన కూడా కరెన్సీ మార్కెట్లో అలజడికి కారణమైందన్నారు. 95.57 వద్ద ప్రారంభమైన డాలర్-రూపాయి ఇంట్రాడేలో చారిత్రక కనిష్ఠ స్థాయి 95.74కి పడిపోయింది. చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే 40 పైసలు కోల్పోయి 95.68 వద్ద స్థిరపడింది. సోమవారం కూడా 79 పైసలు కోల్పోయిన విషయం తెలిసిందే.

## ప్రభుత్వ బ్యాంకులకు లాభాలే లాభాలు

మొదటి పేజీ తరువాయి

లాభాల వృద్ధికి దోహదపడ్డాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. పీఎస్‌బీల మొత్తం నిర్వహణ లాభం రూ.3.21 లక్షల కోట్లకు చేరుకోగా, నికర లాభం గత ఏడాదితో పోలిస్తే 11.1 శాతం పుంజుకుందని వెల్లడించింది. వ్యాపార విస్తరణలో కూడా ప్రభుత్వ బ్యాంకులు పురోగతి సాధించాయి. ఈ ఏడాది మార్చి నాటికి బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.283.3 లక్షల కోట్లకు చేరగా, డిపాజిట్లు 10.6 శాతం పెరిగి రూ.156.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అదే సమయంలో రుణాల పంపిణీ 15.7 శాతం వృద్ధితో రూ.127 లక్షల కోట్లకు పెరగడం, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, రిటైల్ రంగాల్లో లోన్ డిమాండ్ బలంగా కొనసాగినట్లు పేర్కొన్నాయి.

## బీఆర్ఎస్ డిజిటల్ మెంబర్‌షిప్

మొదటి పేజీ తరువాయి

సమన్వయకర్తను నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రతి మండలానికి, మున్సిపల్ బాడీల వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమం సజావుగా నిర్వహించడానికి, సభ్యత్వ సమన్వయ కమిటీ'లను రెండు మూడు రోజుల్లో నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. డిజిటలైజేషన్ పద్ధతిలో సభ్యత్వ నమోదు చేయాలని అనుకుంటుండడంతో రాష్ట్రంలో ఉన్న 35,655 పోలింగ్ బూత్ లలో, బూత్ కు ఇద్దరు కార్యకర్తల చొప్పున మొత్తం 71,310 మంది పార్టీ కార్యకర్తలకు శిక్షణాతరగతులు నిర్వహించాలని, ఈ సందర్భంగా డిజిటల్ మెంబర్ షిప్ ప్రక్రియకు సంబంధించిన విధి విధానాలపై శిక్షణ ఇవ్వాలని సమావేశం అభిప్రాయ పడింది.

## పెట్రో బాదుడు తప్పదేమో!

మొదటి పేజీ తరువాయి

ఈ నాలుగేళ్ల కాలంలో దేశంలో ఎన్ని ఎన్నికలు జరిగాయో మీరు ఒక్కసారి ఆలోచించండి?" అని మంత్రి పూరీ సూటిగా ప్రశ్నించారు. చమురు ధరల సవరణ అనేది పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని, దానికి దేశ రాజకీయాలకు ముడిపెట్టడం ఏమాత్రం సరికాదని ఆయన తేల్చి చెప్పారు. అలాగని చెప్పి భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు అస్సలు పెరగవని తాను కచ్చితంగా చెప్పడం లేదని మంత్రి సున్నితంగా స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మార్కెట్ అనిశ్చితి కారణాల వల్ల ముడిచమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు వస్తున్నాయని వివరించారు. రాబోయే రోజుల్లో పరిస్థితులు పూర్తిగా చేయిదాటితే ధరల సవరణ తప్పనిసరి కావచ్చని ఆయన పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు.

## హమాలీ చార్జీలు పెంపు

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎదురవుతున్న సమస్యలతోపాటు.. జిల్లాల్లో ఉన్న పరిస్థితులు, క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న సమస్యలపై జిల్లా కలెక్టర్ల నుంచి సీఎం రేవంత్ రెడ్డి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎం రేవంత్ కొన్ని ఆదేశాలు జారీ చేశారు. రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించే విషయంలో అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదని గట్టి హెచ్చరికలు చేశారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని ఆదేశించారు. ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసిన వెంటనే రైతులకు సంబంధిత రశీదులు అందించేలా చూడాలని సూచించారు. ధాన్యం తరలింపు సమయంలో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను ఉపయోగించి.. వీలైనంత త్వరగా సంచులను తరలించాలని సీఎం ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొన్న ధాన్యం వీలైనంత త్వరగా గోదాములు, మిల్లులకు పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. వరి అన్‌లోడింగ్ హమాలీ ఛార్జీలను ఇప్పుడు ఉన్న రూ.6.50 నుంచి రూ.8.50కి పెంచుతున్నట్లు తెలిపింది. అదే సమయంలో మధ్యంతర గోదాములకు క్వింటాల్‌కు రూ.17 హ్యాండ్లింగ్ ఛార్జీలుగా నిర్ణయించింది. ఈ 2025-26 సీజన్ నుంచే ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయని సంబంధిత అధికార వర్గాలు వెల్లడించాయి. ఇక కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వాకిటి శ్రీహరిలతోపాటు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కూడా హాజరయ్యారు. అధికారులంతా మిషన్ మోడ్‌లో పనిచేస్తూ రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను ప్రత్యక్షంగా కలెక్టర్లు పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లపై సీఎస్‌కు ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలని కలెక్టర్లకు సూచించారు. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ధాన్యంలో తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా రైతులను రక్షించాలని చెప్పారు. రాష్ట్రంలో గోదాముల సమస్య ఉన్న ప్రాంతాల్లో తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని.. రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను అందుబాటులోకి తీసుకుని ధాన్యాన్ని తరలించాలని.. అక్కడి నుంచి గోడౌన్లకు తరలించేలా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రెడీ చేసుకోవాలని హితవు పలికారు. ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అలర్ట్ చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని.. దానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతీ ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని.. ప్రతి రైస్‌మిల్లు వద్ద ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి, కొనుగోళ్లను పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.




# బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు



హైదరాబాద్, మే 12 (ఈవార్తలు): కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడనే ఆరోపణలతో అతనిపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలంటూ సిట్ నోటీసులు పంపించింది. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది. బండి భగీరథ్ కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకుంది. కేసు విచారణ పారదర్శకంగా జరగాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీజీపీని ఇటీవల ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ కేసు సిట్ విచారిస్తోంది. బండి భగీరథ్‌పై బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మరోవైపు, తనను హనీట్రాప్ చేశారని బండి భగీరథ్ కరీంనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

# ప్రారంభమైన 'ఔషధి ఎక్స్‌ప్రెస్'

## దేశంలోనే తొలి ఫార్మసీ రైలు!




హైదరాబాద్, మే 12 (ఈవార్తలు): భారతీయ రైల్వే మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. హైదరాబాద్ నుంచి ఔషధాలను సురక్షితంగా ఎగుమతి చేసేందుకు 'ఔషధి ఎక్స్‌ప్రెస్' పేరుతో దేశంలోనే మొట్టమొదటి ఫార్మసీ రైలును అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్రత్యేక రైలు ఈ నెల 2వ తేదీన హైదరాబాద్ నుంచి ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్టుకు తన తొలి యాత్రను విజయవంతంగా పూర్తి చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఔషధాలను వాటి నాణ్యత ఏమాత్రం దెబ్బతినకుండా నిర్ణీత ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేయడం అత్యంత కీలకం. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ రైలులో అత్యాధునిక కోల్డ్ స్టోరేజీ కంటైనర్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల హైదరాబాద్‌లోని వందలాది ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తులను సురక్షితంగా, వేగంగా ముంబై పోర్టుకు చేరవేసి, అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేయడం సులభతరం అవుతుంది. గతంలో రోడ్డు మార్గంలో రవాణాకు ఎక్కువ సమయం పట్టడంతో పాటు ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గుల వల్ల మందులు పాడయ్యే ప్రమాదం ఉండేది. ఔషధి ఎక్స్‌ప్రెస్ ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపనుంది. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పీఎం గతిశక్తి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ ఆవిష్కరణకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. "ఇది కేవలం ఒక రైలు మాత్రమే కాదు, తెలంగాణ ఫార్మా రంగానికి ఒక లైఫ్ లైన్ వంటిది. దీనివల్ల సరైన సమయంలో, సరైన నాణ్యతతో మందులు గమ్యస్థానాలకు చేరతాయి" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో భవిష్యత్తులో దేశంలోని ఇతర ఫార్మా కేంద్రాలకు కూడా ఇలాంటి రైళ్లను విస్తరించే యోచనలో ఉన్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# నా కొడుకు తప్పు చేయలేదు

## పోక్సో కేసు నుంచి నిర్దోషిగా వస్తాడు

## కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, మే 12 (ఈవార్తలు): రాష్ట్రంలో పెను సంచలనంగా మారిన బండి భగీరథ్ కేసుపై ఆయన తండ్రి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తాజాగా స్పందిస్తూ.. తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కరీంనగర్‌లో నిర్వహించిన హిందూ ఏక్తా యాత్ర ర్యాలీలో పాల్గొన్న బండి సంజయ్ .. తన కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై స్పందించారు. తన కుమారుడు ఏ తప్పూ చేయలేదని చెప్పాడని.. ఈ కేసు నుంచి నిర్దోషిగా బయటికి వస్తానని చెప్పినట్లు వెల్లడించారు. తన కుమారుడిని ఒక నేరస్థుడి లాగా చూపించే కుట్ర జరుగుతోందని ఆరోపించిన బండి సంజయ్.. కన్నపేగు డిప్రెషన్‌లో ఉందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసుపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. తాను ఏ దారిలో వెళుతున్నానో అదే దారిలో తన భార్య కూడా వస్తోందన్నారు. తన దగ్గర కంటే తన భార్య దగ్గరకే కార్యకర్తలు ఎక్కువగా వెళ్తారని చెప్పారు. ఈరోజు తన భార్య డిప్రేషన్ లోకి వెళ్లిందని.. తల్లడిల్లిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని తేల్చి చెప్పిన బండి సంజయ్.. చట్టం ముందు అందరూ సమానులేనని స్పష్టం చేశారు. తప్పు చేసినవారిని సమర్థించేదిలేదని వెల్లడించారు. తన కుటుంబంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడి చేస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బండి సంజయ్‌ని గెలికారని.. తనను, తన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టినవాళ్లను ఒక్కర్ని కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఆంజనేయస్వామి తోకకు నిప్పు పెడితే.. లంకను మొత్తం దహించి వేసినట్లు.. తనకు పెట్టిన నిప్పు వారికే అంటుకుంటుందని బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తనకు పెట్టిన నిప్పుతో దళారుల వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, అవినీతి వ్యవస్థను దహనం చేస్తానని తేల్చి చెప్పారు. శ్రీరామచంద్రుడి అంతటి వ్యక్తికే అరణ్యవాసం తప్పలేదని పేర్కొన్నారు. తన గుండె మీద కాషాయం జెండా ఉందని.. తన తల మీద అమ్మవారి ఆశీస్సులు ఉన్నాయని బండి సంజయ్ చెప్పారు. ప్రజలే తన కుటుంబమని భావించానని.. తన కుటుంబం కంటే ప్రజల కోసమే ఎక్కువ సమయం కేటాయించినట్లు చెప్పిన బండి సంజయ్.. తన కుమారుడికి సమయం కేటాయించలేదని, కనీసం మాట్లాడలేదని పేర్కొన్నారు. అదే తాను పొరపాటు చేశానని, తప్పు చేశానని.. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలకు క్షమాపణలు చెబుతున్నట్లు వెల్లడించారు. దయచేసి తప్పుడు ప్రచారాలని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. తప్పు చేసింది ఎవరైనా, తన కుమారుడైనా వదిలిపెట్టేది లేదని చెప్పిన బండి సంజయ్.. కుట్రలు, కుతంత్రాలతో తన కుటుంబాన్ని బజారున పడేశారని ఆరోపించారు.

# రైల్ రోకో.. కవితకు షాక్

సికింద్రాబాద్, మే 12 (ఈవార్తలు): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో కామారెడ్డిలో రైల్‌రోకో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించడం, నిబంధనలను ఉల్లంఘించడం వంటి కారణాలతో ఆమెతో పాటు మరో 12 మందిపై రైల్వే యాక్ట్‌లోని యూ/సెక్షన్ 147, 74(ఏ) కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు కవితకు సమన్లు జారీ చేసింది. రేపు ఉదయం 10.30 గంటలకు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది.





## చీఫ్ విప్‌గా డ్రైవర్ కొడుకు

**తమిళనాడు సీఎం విజయ్ సంచలన నిర్ణయం**

**సామాన్యులకు ప్రాధాన్యత అంటున్న విజయ్ వర్గం**

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కారు డ్రైవర్ కుమారుడు, తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన శబరినాథన్‌ను ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ అనూహ్య నియామకం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శాసనసభ ఎన్నికల్లో, తన వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్‌కు విజయ్ తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) తరఫున టికెట్ ఇచ్చారు. చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన శబరినాథన్ విజయం సాధించారు. తాజాగా ఆయన్ను ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా తన ప్రభుత్వం సామాన్యులకు, విధేయతకు పెద్దపీట వేస్తుందనే స్పష్టమైన సంకేతాన్ని విజయ్ పంపినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ నియామకంపై సామాజిక మాధ్యమాల్లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యుడికి ఉన్నత పదవి దక్కడం అభినందనీయమని కొందరు ప్రశంసిస్తుండగా, ఎలాంటి అనుభవం లేని వ్యక్తికి ఇంత కీలకమైన శాసనసభా పదవిని కట్టబెట్టడం సరికాదని మరికొందరు విమర్శిస్తున్నారు. .

## షణ్ముగం ఇంటికి విజయ్

**అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేలతో కీలక భేటీ**

చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో మే 10న విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిస్థితులు అత్యంత వేగంగా మారుతున్నాయి. రేపు (మే 13) జరగనున్న ఫ్లోర్ టెస్ట్ కు ముందు అన్నాడీఎంకేలో చీలిక రావడం విజయ్ ప్రభుత్వానికి పెద్ద ఊరటనిచ్చే పరిణామం అని చెప్పవచ్చు. ప్రభుత్వ ఏర్పాటుకు ముందు మెజారిటీ మార్క్ (118)కు కొద్దిగా దూరంలో నిలిచిన టీవీకే అధినేత విజయ్ క్రమంగా పలు పార్టీల నుంచి మద్దతు లభించింది. రేపు (మే 13) బలపరీక్ష నేపథ్యంలో, అన్నాడీఎంకే సీనియర్ నేత సీవీ షణ్ముగం నాయకత్వంలో సుమారు 30 మంది ఎమ్మెల్యేలు విజయ్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమవ్వడం సంచలనం రేపింది. తాజాగా రెబల్ నేత షణ్ముగం ఇంటికి విజయ్ స్వయంగా వెళ్లారు. షణ్ముగం, వేలుమణి సహా 30 మంది ఎమ్మెల్యేలతో ఆయన భేటీ అయ్యారు. ఈ సమావేశంలో భవిష్యత్తు రాజకీయ వ్యూహాలు, మంత్రి పదవుల కేటాయింపుపై ఈ భేటీలో విజయ్ చర్చించినట్లు సమాచారం. ఈ పరిణామం విజయ్ ముఖ్యమంత్రిగా తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి మార్గం సుగమం చేసింది. పార్టీపై పట్టు కోల్పోయిన పళనిస్వామికి ఇప్పుడు కేవలం 17 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మిగిలి ఉన్నారు. గత ఎన్నికల్లో పొత్తుల విషయంలో ఆయన అనుసరించిన మొండి వైఖరే పార్టీలో అసంతృప్తికి, తాజా చీలికకు ప్రధాన కారణమని సొంత పార్టీ నేతలే బహిరంగంగా విమర్శిస్తున్నారు. షణ్ముగం, వేలుమణి వంటి కీలక నేతలు విజయ్ వైపు మొగ్గు చూపడంతో అన్నాడీఎంకే ఉనికి ఇప్పుడు ప్రమాదంలో పడింది.

## నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల స్థావరం గుర్తింపు

నారాయణపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల రహస్య స్థావరాన్ని భద్రతా బలగాలు గుర్తించాయి. 'మాద్ బచావో అభియాన్' కింద డీఆర్జీ, ఎస్‌టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్ సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భారీగా నగదు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. రూ.1.64 కోట్ల నగదు, మూడు ఏకే-47 రైఫిళ్లు, మూడు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, రెండు నాటు తుపాకులు సహా భారీగా ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వందలాది తూటాలు, మ్యాగజైన్‌లు, ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, కార్డెక్స్ వైర్, వాకీ టాకీ సెట్లు లభ్యమయ్యాయి. మావోయిస్టు రహిత జిల్లాగా తయారు చేసేందుకు ఇలాంటి ఆపరేషన్లు కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు.

## నీట్ లీక్‌పై సీబీఐ

నిజామాబాద్, మే 12 (ఈవార్తలు): నీట్ (యూజీ) 2026 ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారానికి సంబంధించి సీబీఐ కేసు నమోదు చేసింది. కేంద్ర విద్యా శాఖ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసింది. ఈ మేరకు అధికారులు వెల్లడించారు. మే 3వ తేదీన జరిగిన ఈ పరీక్షల్లో అక్రమాలు జరిగినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్టీఏ ప్రకటించింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయాలని కేంద్రం ఆదేశించడంతో, సీబీఐ రంగంలోకి దిగింది. నేరపూరిత కుట్ర, మోసం, ఇతర నేరాలకు సంబంధించి బీఎన్ఎస్‌లోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న రాజస్థాన్ పోలీసుల నుంచి సమాచారాన్ని సేకరించడానికి త్వరలో ఒక బృందాన్ని అక్కడకు పంపించనున్నారు. 2024లోని నీట్ పేపర్ లీక్ కేసులను కూడా సీబీఐ ఛేదించింది.

# ఓఎస్డీగా జ్యోతిష్యుడు

## నమ్మినబంటుగా, పార్టీ అధికార ప్రతినిధిగా గుర్తింపు



చెన్నై: తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం ఓ కీలక నియామకం చేపట్టింది. ముఖ్యమంత్రి విజయ్ తన రాజకీయ వ్యవహారాల కోసం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా తన అత్యంత సన్నిహితుడు, జ్యోతిష్కుడు, పార్టీ అధికార ప్రతినిధి అయిన రిక్కీ రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, వెట్రివేల్ ముఖ్యమంత్రి విజయ్‌కు రాజకీయ సహాయకుడిగా వ్యవహరిస్తారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో రాజకీయ సమన్వయం, సలహా సంబంధిత విధులను ఆయన పర్యవేక్షిస్తారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన టీవీకే ప్రభుత్వం, తమ పాలనా యంత్రాంగాన్ని పటిష్టం చేసుకుంటున్న తరుణంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎంకు ఓఎస్‌డీగా వెట్రివేల్ నియామకం వెనుక ఉన్న కారణాలు, దాని ప్రభావంపై రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది. రిక్కీ రాధన్ పండిట్ వెట్రివేల్ చాలా కాలంగా నటుడు విజయ్‌కు అత్యంత సన్నిహితుడిగా, జ్యోతిష్కుడిగా ప్రసిద్ధి చెందారు. గత కొన్నేళ్లుగా విజయ్ వ్యక్తిగత, రాజకీయ కార్యక్రమాల్లో ఆయన వెన్నంటే ఉన్నారు. టీవీకే పార్టీ ఆవిర్భావం తర్వాత, ఆయన్ను పార్టీ అధికార ప్రతినిధులలో ఒకరిగా నియమించారు. అప్పటి నుంచి టీవీ చర్చల్లో, బహిరంగ వేదికలపై పార్టీ వాణిని బలంగా వినిపిస్తూ వస్తున్నారు. విజయ్‌కు అత్యంత విశ్వసనీయమైన అంతర్గత బృందంలో వెట్రివేల్ ఒకరని, పార్టీ ఏర్పాటు నుంచి కమ్యూనికేషన్, సమన్వయ బాధ్యతల్లో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఈ నియామకం ద్వారా ముఖ్యమంత్రి విజయ్ తన పాలనలో నమ్మకమైన వారికే పెద్దపీట వేస్తున్నారనే సంకేతాలు పంపారు. విధేయత, విశ్వాసం ఆధారంగా తీసుకున్న సరైన నిర్ణయమని అధికార పార్టీ మద్దతుదారులు అంటుండగా, ప్రభుత్వ పరిపాలనలో సంప్రదాయేతర రాజకీయ వ్యక్తుల ప్రభావం పెరగడంపై విపక్షాలు, రాజకీయ విశ్లేషకులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. మే 10న అధికారం చేపట్టినప్పటి నుంచి విజయ్ ప్రభుత్వం తనదైన పాలన ముద్ర చూపేందుకు వరుస నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ తాజా నియామకంతో ముఖ్యమంత్రి కార్యాలయంలో రాజకీయ సమన్వయ యంత్రాంగం మరింత బలోపేతం కానుంది.

### మరోసారి ఆలోచించండి: వీసీకే

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన జ్యోతిష్కుడు రాధన్ పండిట్ వెట్రివేల్‌ను ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా నియమించడంపై టీవీకే మిత్రపక్షం వీసీకే స్పందించింది. ఇప్పటికే ఈ నియామకంపై కాంగ్రెస్ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. జ్యోతిష్కుడిగా, టీవీకే పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్న వెట్రివేల్‌ను ఓఎస్డీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. లౌకిక ప్రభుత్వంలో ఇది ఆమోదయోగ్యం కాదని, గౌరవనీయులైన ముఖ్యమంత్రి ఈ నియామకంపై పునఃపరిశీలన చేయాలని వీసీకే ప్రధాన కార్యదర్శి డి.రవికుమార్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ అశాస్త్రీయ నిర్ణయాన్ని తమిళనాడు ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన మరో పోస్టులో డిమాండ్ చేశారు. వెట్రివేల్ వంటి వ్యక్తిని ప్రభుత్వ ఖర్చుతో అధికారిగా నియమించడం ప్రజలలో జ్యోతిష్యంపై విశ్వాసాన్ని పెంచడానికి మాత్రమే ఉపయోగపడుతుందని, ప్రభుత్వం చేసిన ఈ నియామకం ఆమోదయోగ్యం కాదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు పి. షణ్ముగం పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి రాజకీయ సలహాలు ఇవ్వడానికి కూడా ఆమోదయోగ్యుడు కాదని అభిప్రాయపడ్డారు.

# 16,600 కోట్లు

## విదేశీ బాండ్ల కొనుగోలుకు నిర్ణయం.. ఎస్బీఐ సంచలన అడుగులు




న్యూఢిల్లీ: భారతీయ బ్యాంకింగ్ రంగంలో అగ్రగామిగా వెలుగొందుతున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), తన ఆర్థిక సామ్రాజ్యాన్ని ప్రపంచ స్థాయికి విస్తరించడానికి సంచలన నిర్ణయం తీసుకుంది. దేశీయంగా నిధుల లభ్యత బాగున్నా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించడానికి బ్యాంక్ బోర్డు పచ్చజెండా ఊపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో విదేశీ బాండ్ల జారీ ద్వారా ఏకంగా 2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.16,600 కోట్లు) మేర దీర్ఘకాలిక నిధులను సేకరించాలనే ప్రతిపాదనకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో బ్యాంక్ వివరాలను వెల్లడించింది. ఈ నిధుల సేకరణ ప్రక్రియను బ్యాంక్ ఒకేసారి కాకుండా, విడతల వారీగా చేపట్టే అవకాశం ఉంది. రెగ్-ఎస్/144ఏ నిబంధనల ప్రకారం, బహిరంగ ఆఫర్లు లేదా ప్రైవేట్ ప్లేస్‌మెంట్ల ద్వారా ఈ బాండ్లను జారీ చేస్తారు. అమెరికన్ డాలర్లు లేదా ఇతర ప్రధాన విదేశీ కరెన్సీలలో ఈ నిధులను సేకరిస్తారు. ఈ బాండ్లపై స్థిర లేదా ఫ్లోటింగ్ వడ్డీ రేట్లు ఉండే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో, ముఖ్యంగా అమెరికా, ఆసియా దేశాలలోని సంస్థాగత పెట్టుబడిదారులను చేరుకోవడానికి ఈ రెగ్-ఎస్/144ఏ మార్గాలు చాలా అనువుగా ఉంటాయి. ఇవి బ్యాంక్‌కు విస్తృతమైన పెట్టుబడిదారుల బేస్‌ను అందిస్తాయి. భారతదేశంలో ప్రస్తుతం రుణాలకు డిమాండ్ పెరుగుతోంది. మరోవైపు దేశీయ మార్కెట్‌లో వడ్డీ రేట్లు అధికంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ నిధుల వనరులను వైవిధ్యీకరించుకోవాలని భావిస్తోంది. కేవలం దేశీయ డిపాజిట్లపైనే ఆధారపడకుండా విదేశీ పెట్టుబడిదారులను కూడా చేరుకోవడం బ్యాంక్ ప్రధాన ఉద్దేశం. విదేశీ కరెన్సీ బాండ్ల జారీ ద్వారా పెట్టుబడిదారుల సంఖ్యను పెంచుకోవచ్చు. అలాగే బ్యాంక్ యొక్క దీర్ఘకాలిక నిధుల స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. చివరిసారిగా ఎస్‌బీఐ సెప్టెంబర్ 2025లో విదేశీ బాండ్ల ద్వారా నిధులను సేకరించింది. అప్పుడు 500 మిలియన్ డాలర్లను 4.5% అత్యల్ప కూపన్ రేటుతో ఐదేళ్ల కాలపరిమితికి పొందింది. మార్చి త్రైమాసికం ముగిసేనాటికి బ్యాంక్ ఆర్థిక ఫలితాలను గమనిస్తే.. స్థూల రుణాలు గత ఏడాది కంటే 17% పెరిగి రూ 49.32 ట్రిలియన్‌లకు చేరుకున్నాయి. డిపాజిట్లు కూడా 11% వృద్ధితో రూ 59.75 ట్రిలియన్‌లుగా నమోదయ్యాయి. ఈ ఫలితాలు కొంత తక్కువగా ఉన్నా, పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అనిశ్చితి నెలకొన్నా బ్యాంక్ ధీమాగా ఉంది. 2027 ఆర్థిక సంవత్సరానికి రుణ వృద్ధి అంచనాలను 13-15% గానే ఉంచింది. చైర్మన్ సి.ఎస్. సెట్టి చెప్పిన ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థలో రుణ వృద్ధి 13-14%, డిపాజిట్ల వృద్ధి 11-12% వరకు ఉండవచ్చు. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగం అంతటా రుణాల నాణ్యత చాలా బాగుందని చైర్మన్ స్పష్టం చేశారు. అయితే పశ్చిమాసియా యుద్ధం యొక్క పూర్తి ప్రభావం ఇంకా బయటపడలేదని ఆయన హెచ్చరించారు. ఈ సంఘర్షణ వల్ల రెండో స్థాయి ప్రభావాలు ఉండే అవకాశం ఉంది. ఒకవేళ ఈ ఘర్షణ మరో ఐదు, ఆరు నెలల పాటు కొనసాగితే ఆర్థిక వ్యవస్థపై కొంత ప్రభావం పడవచ్చు. దీనివల్ల ఇంధన ధరలు పెరగడం, సరఫరా గొలుసులో అడ్డంకులు ఏర్పడే ప్రమాదం ఉందని సెట్టి అభిప్రాయపడ్డారు. ఈ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఎస్‌బీఐ విదేశీ నిధుల సేకరణ ద్వారా తమ ఆర్థిక పటిష్టతను పెంచుకోవడానికి సిద్ధమవుతోంది.




## స్టాక్ మార్కెట్లు ధమాల్

ముంబై: భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. వరుసగా రెండో సెషన్‌లో కూడా అమ్మకాల సునామీ కొనసాగింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా అన్ని రంగాల షేర్లలోనూ తీవ్రమైన అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1,456.04 పాయింట్లు పతనమై 74,559.24 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 436.3 పాయింట్లు నష్టపోయి 23,379.55 వద్ద ముగిసింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో ఇంధన వినియోగం, విదేశీ ప్రయాణాలు, బంగారం కొనుగోళ్లు తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపునివ్వడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మరింత బలహీనపరిచింది. ఈ వ్యాఖ్యలతో పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థపై విస్తృత ప్రభావం చూపుతుందనే భయాలు తీవ్రమయ్యాయి. బ్రాడర్ మార్కెట్‌లో నష్టాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 2.54 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 3.17 శాతం మేర పతనమయ్యాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ, రియల్టీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, టైటాన్, టీసీఎస్ వంటి షేర్లు 4.44 శాతం వరకు నష్టపోయాయి. సెన్సెక్స్ 30 షేర్లలో ఎస్‌బీఐ మాత్రమే లాభాల్లో ముగియడం గమనార్హం. సాంకేతిక విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి తక్షణ మద్దతు 23,300 వద్ద, ఆ తర్వాత 23,100 వద్ద ఉందని చెబుతున్నారు. ఎగువ స్థాయిలో 23,500 తక్షణ నిరోధకంగా మారింది. క్రూడ్ ఆయిల్ ధరలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్లలో ఒడిదుడుకులు కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, పటిష్ఠమైన దేశీయ ఆర్థిక మూలాలు మార్కెట్లకు మద్దతుగా నిలుస్తాయని వారు అభిప్రాయపడుతున్నారు.

## అస్సాం సీఎంగా హిమంత ప్రమాణం

గువాహటి: అస్సాంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గువాహటిలోని ఖానాపారాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య.. హిమంత బిశ్వ శర్మ చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. అస్సాం సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న శర్మ, ప్రమాణం చేస్తున్న సమయంలో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హిమంతతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో కేంద్ర మాజీ మంత్రి రామేశ్వర్ తేలి, అసోం గణ పరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) నేత చరణ్ బోరో, సీనియర్ బీజేపీ నేత అజంత నియోగ్ ఉన్నారు.

## రాయదుర్గంలో ఎకరాకు రూ.139 కోట్లు!

రాయదుర్గం, మే 12 (ఈవార్తలు): హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో సంచలనానికి రంగం సిద్ధమైంది. నగరంలోని అత్యంత కీలకమైన ఐటీ కారిడార్‌లో ఉన్న రాయదుర్గంలో విలువైన ప్రభుత్వ భూములను వేలం వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ భూములకు ఎకరాకు కనీస ధర (అప్‌సెట్ ప్రైస్) ఏకంగా రూ.139 కోట్లుగా నిర్ధారించడం విశేషం. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ) ఈ మేరకు మే 6న అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, రాయదుర్గం పాన్మక్తాలోని సర్వే నెం. 83/1లో ఉన్న హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో ఈ భూములు ఉన్నాయి. మొత్తం 11.38 ఎకరాల భూమిని రెండు ప్లాట్లుగా విభజించి 'యాజ్ ఈజ్ వేర్ ఈజ్' ప్రాతిపదికన ఈ-వేలం వేయనున్నారు. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు సమీపంలో ఉన్న ఈ భూములు ఐటీ, వాణిజ్య కారిడార్‌లో అత్యంత కీలకంగా ఉన్నాయి. క్వాల్‌కామ్ భవనానికి ఎదురుగా, టీ-హబ్, టీ-వర్క్స్ వంటి ఆవిష్కరణ కేంద్రాలకు దగ్గరలో ఉండటం వీటి విలువను పెంచుతోంది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), రాయదుర్గం మెట్రో స్టేషన్, అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా మెరుగైన కనెక్టివిటీ ఉంది. ఈ ప్లాట్లు మల్టీ-యూజ్ జోనింగ్‌లో ఉండటం వల్ల రెసిడెన్షియల్, కమర్షియల్, రిటైల్ లేదా హాస్పిటాలిటీ ప్రాజెక్టులు నిర్మించుకునే వెసులుబాటు ఉంటుంది. గతంలోనూ ఇదే ప్రాంతంలో జరిగిన వేలం ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. 2025 అక్టోబర్‌లో ఎకరాకు రూ.101 కోట్ల కనీస ధరతో వేలం నిర్వహిస్తే, గరిష్ఠంగా రూ.177 కోట్లు పలికింది. ఆ అనుభవంతో ప్రభుత్వం ఈసారి కనీస ధరను రూ.139 కోట్లకు పెంచింది. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో బలమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఈ వేలంపై డెవలపర్లు, కార్పొరేట్ సంస్థలు భారీ ఆసక్తి చూపే అవకాశం ఉంది. ఈ వేలం ఫలితాలు హైదరాబాద్ ప్రీమియం రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు కొత్త బెంచ్‌మార్క్‌లను నిర్దేశిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## 10 లక్షలు దాటితే ఎల్పీజీ కట్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఎల్పీజీ గ్యాస్ సబ్సిడీ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. వార్షిక ఆదాయం రూ. 10 లక్షలు దాటిన కుటుంబాలకు సబ్సిడీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఇది 2015 నుంచి ఉన్న రూలే అయినప్పటికీ, ఇప్పటివరకు వినియోగదారుల వ్యక్తిగత డిక్లరేషన్‌పై ఆధారపడేవారు. కానీ ఇప్పుడు నేరుగా పాన్ కార్డ్ డేటా ఆధారంగా ఐటీ రికార్డులను తనిఖీ చేస్తున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, కేవలం కనెక్షన్ ఉన్న వ్యక్తి ఆదాయమే కాదు.. భార్యాభర్తల్లో ఎవరి ఆదాయం రూ. 10 లక్షలు దాటినా ఆ కుటుంబం సబ్సిడీకి అనర్హమవుతుంది. ఇప్పటికే ఐటీ రికార్డుల ప్రకారం అనర్హులుగా తేలిన వారికి ఆయిల్ కంపెనీలు మెసేజ్‌లు పంపిస్తున్నాయి. 7 రోజుల్లోగా అభ్యంతరాలు తెలపకపోతే ఆటోమేటిక్‌గా సబ్సిడీ కట్ అయిపోతుంది. ఈ నిబంధనల వల్ల సామాన్యులకు లేదా పేదలకు ఎలాంటి ఇబ్బంది లేదు. ముఖ్యంగా 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' లబ్ధిదారులకు ఈ రూల్ వర్తించదు. వారికి వచ్చే సబ్సిడీ యథావిధిగా అందుతుంది.

# సరిహద్దులో భారత్ ఫెన్సింగ్

## ఘాటుగా స్పందించిన బంగ్లాదేశ్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి నేతృత్వంలోని నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దు రక్షణపై తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయంపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తాజాగా స్పందించింది. భారత్ సరిహద్దుల్లో ముళ్లకంచె వేయడంపై బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సలహాదారు ఎం.హెచ్. కబీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ముళ్ల తీగలకు ఢాకా భయపడదు" అని పేర్కొంటూనే, తమ జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భారత్ అంతర్గత రాజకీయాల్లో తాము జోక్యం చేసుకోమని, తమకు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వంతోనే సంబంధాలు ఉంటాయని ఆయన వివరించారు. సవాళ్లు ఉన్నప్పటికీ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు నాయకత్వం కట్టుబడి ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ తన ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం, అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే సరిహద్దు కంచె నిర్మాణ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించింది. ముఖ్యమంత్రి సువేందు అధికారి తొలి మంత్రివర్గ సమావేశంలోనే బీఎస్ఎఫ్‌కు అవసరమైన భూమిని కేటాయించడం ద్వారా ఈ దిశగా బలమైన ముందడుగు వేశారు. అక్రమ చొరబాట్లను అరికట్టడమే లక్ష్యంగా చేపట్టిన ఈ చర్య ఇప్పుడు పొరుగు దేశంతో ఉన్న సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.



# మీర్ కాజిం అలీకి నామినేటెడ్ పోస్ట్ ఇవ్వాలి

## జగిత్యాల ముస్లింల ఏకగ్రీవ డిమాండ్.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు వినతి

జగిత్యాల, మే 12 (ఈవార్తలు): సంజయ్ కుమార్ ను జగిత్యాల ముస్లిం సమాజ ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మసీదుల కమిటీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, యువజన సంఘాల ప్రతినిధులు కలిసి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. జగిత్యాల నియోజకవర్గం ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతమని, ముస్లిం సమాజం ఎప్పటికప్పుడు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. మున్సిపల్, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలన్నింటిలోనూ కాంగ్రెస్ పార్టీ విజయానికి ముస్లిం సమాజం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ, జగిత్యాల ముస్లిం వర్గానికి ఇప్పటివరకు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీపీసీ సీనియర్ నాయకుడు, మిల్లత్-ఎ-ఇస్లామియా జగిత్యాల మాజీ అధ్యక్షుడు మీర్ కాజీం అలీని స్టేట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని, అదేవిధంగా మరో కాంగ్రెస్ పార్టీ నాయకుడికి డైరెక్టర్ లేదా కమిషన్ సభ్యుడి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ చర్య ద్వారా ముస్లిం సమాజానికి న్యాయం జరిగి, కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ఎం. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, మీర్ కాజిం అలీ గారికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రతినిధి బృందంలో జనాబ్ షరపుద్దీన్, హాఫిజ్ సయ్యద్ షంసుద్దీన్ తబ్రేజ్, అబ్దుల్ రషీద్, అబ్దుల్ జలీల్, ఎం.ఏ. సలీం అబిద్, ఖాజా లియాఖత్ అలీ మొహ్సిన్, ఖాజీ మక్సూద్ అలీ మతీన్, సుమేర్ ఉద్దీన్ ఆజాద్, ఎం.ఏ. రజీ ఉద్దీన్, డా. ఎం.డి. అయూబ్ ఖాన్, ముజాహిద్ ఆదిల్, షేక్ నజీర్ అహ్మద్, ఇర్ఫాన్ జాఫర్ రషీద్, ఖాజా అమీర్ ఉద్దీన్, అబ్దుల్ రెహ్మాన్, ఆరిఫ్ హుస్సేన్, ఎం.డి. రియాజ్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.





# మల్యాలలో ఘనంగా రథోత్సవం

మల్యాల, మే 12 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాలలోని శ్రీ మఠమఆంజనేయ దేవస్థానంలో హనుమాన్ జన్మోత్సవాల సందర్భంగా మల్యాల పట్టణంలో నిర్వహించిన రథోత్సవం ఘనంగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో గ్రామం అంత భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. ప్రత్యేక పూజలు, అభిషేకాలు అన్న ప్రసాదం అనంతరం, స్వామివారిని రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. రథోత్సవం ప్రధాన వీధుల గుండా సాగగా భక్తులు హారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. యువకులు భజనలు, డీజే చప్పుల్లతో కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు.



# భగీరథను అరెస్ట్ చేయాలి: బీఆర్ఎస్

జగిత్యాల, మే 12 (ఈవార్తలు): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు బండి భగీరథను వెంటనే పోక్సో కేసులో అరెస్ట్ చేసి బాధిత బాలికకు న్యాయం చేయాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అధికారాన్ని అడ్డం పెట్టుకొని కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మైనర్ బాలికపై జరిగిన ఘటనలో నిందితుడిని వెంటనే అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టం అందరికీ సమానమని, మంత్రుల కుటుంబ సభ్యులకు ప్రత్యేక మినహాయింపులు ఉండకూడదని అన్నారు. బాధిత బాలికకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే కేంద్ర సహాయ మంత్రి పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక, సర్పంచులు నల్ల కవిత, పల్లె లక్ష్మి, మాజీ సర్పంచ్ గంగ నర్సు, మాజీ కౌన్సిలర్ ఒద్ది శ్రీలత, బీఆర్ఎస్ మహిళా నాయకులు అనురాధ, కళ్యాణి, మానస తదితరులు పాల్గొన్నారు.




# 'మురికి'కి మేకప్!?

**మున్సిపల్ భవనానికి రంగులు.. రెనోవేషన్‌లకే లక్షలు.. ప్రజాధనం వృథా**

జగిత్యాల, మే 12 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ కార్యాలయ భవనంలో రెనోవేషన్ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం జరుగుతోందని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. మున్సిపల్ కొత్త భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, ప్రస్తుతం జరుగుతున్న పనులను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, మున్సిపల్ భవనంలో గత పాలకవర్గాలు, ప్రస్తుత పాలకవర్గం వరుసగా రెనోవేషన్ పనుల పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేశాయని ఆరోపించారు. ఇటీవల రెండు అంతస్తుల రెనోవేషన్‌కు రూ. 10 లక్షలు, చైర్మన్ చాంబర్‌కు రూ. 98 వేలతో పనులు చేపట్టారని పేర్కొన్నారు. గతంలో కూడా చాంబర్లు, గ్రీనరీ, పార్టిషన్ పనుల పేరుతో భారీగా ఖర్చు చేసినట్లు తెలిపారు. అయితే ప్రజలకు సరైన సౌకర్యాలు లేకపోవడం, మహిళా కౌన్సిలర్లు, మహిళా అధికారులకు ప్రత్యేక టాయిలెట్ సదుపాయం కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజలు పన్నులు చెల్లిస్తున్నప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. మున్సిపాలిటీకి ప్రత్యేక స్థలం కేటాయించి, ప్రజలకు, అధికారులకు అనుకూలంగా విశాలమైన గదులతో కొత్త మున్సిపల్ భవనం నిర్మించాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న రెనోవేషన్ పనులను వెంటనే నిలిపివేసి, అత్యవసర అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు.

# తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

తిరుమల, మే 12 (ఈవార్తలు): కొన్ని రోజులుగా భక్తులతో కిటకిటలాడిన తిరుమలలో ఈరోజు రద్దీ తగ్గింది. ప్రస్తుతం 22 కంపార్టుమెంట్లలో భక్తులు ఉన్నారు. సర్వదర్శనం కోసం వచ్చిన భక్తులకు 8 గంటల్లో స్వామివారి దర్శనం కలుగుతోంది. రూ. 300 ప్రత్యేక దర్శనం టికెట్లు ఉన్నవారికి 3 నుంచి 4 గంటల్లో దర్శనం అవుతోంది. రద్దీ తగ్గడం వల్ల వసతి సౌకర్యాల విషయంలో కూడా సామాన్య భక్తులకు ఊరట లభిస్తోంది. ముఖ్యంగా శ్రీపద్మావతి విచారణ కేంద్రం, ఎంబీసీ వంటి ప్రాంతాల్లోని గదులకు డిమాండ్ తగ్గింది.




# యువతకు హనుమంతుడే ఆదర్శం

జగిత్యాల, మే 12 (ఈవార్తలు): యువత హనుమంతుడిని ఆదర్శంగా తీసుకొని భక్తి, ధైర్యం, సేవాభావంతో ముందుకు సాగాలని భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని విద్యానగర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో హిందూ బంధువులకు, భక్తులకు, హనుమాన్ స్వామీజీలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీఎస్ రాజు మాట్లాడుతూ హనుమంతుడు బలం, భక్తి, సేవ, ధైర్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. నేటి యువత దేశభక్తి, సమాజ సేవా గుణాలను అలవర్చుకొని ఆదర్శవంతమైన జీవితం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, అక్కినపల్లి కాశీనాథం, చిట్ల గంగాధర్, వేముల పోచమల్లు, సింగం గంగాధర్, కె.ఆర్. కృష్ణ, బాశెట్టి దుబ్బరాజం, సిరిపురం గంగారం, నరేందుల శ్రీనివాస్, కొత్తకొండ బాలన్న తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెరగాలి: కలెక్టర్



జగిత్యాల, మే 12(ఈవార్తలు): వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుంచి మండల తహసీల్దార్లతో గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పురోగతి, ధాన్యం నిల్వలు, రవాణా, హమాలీలు, గన్నీ బ్యాగుల సరఫరా తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్న ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ, టార్పాలిన్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు, మిల్లర్లు, రవాణా యాజమాన్యాలు సమన్వయంతో పని చేసి కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. ప్రతి రోజు కొనుగోలు వివరాలను నమోదు చేసి నివేదికలు సమర్పించాలని, కేంద్రాల వద్ద పారదర్శకత పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.



# అల్ఫోర్స్‌లో ఘనంగా హనుమాన్ జన్మోత్సవాలు

కరీంనగర్, మే 12 (ఈవార్తలు): కరీంనగర్‌లోని కొత్తపల్లిలో ఉన్న అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని హనుమాన్ దేవాలయంలో పెద్ద హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు "అల్ఫోర్స్" డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి అష్టోత్తర పూజలు నిర్వహించి వివిధ ద్రవ్యాలు, పండ్ల రసాలు, పుష్పాలు, ఫలపంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేడుకల్లో భాగంగా హోమం నిర్వహించగా, భజనలు, సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆంజనేయుడు ధైర్యం, బలం, నమ్మకానికి ప్రతీక అని, ఆయనను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే జీవితంలో అడ్డంకులు తొలగిపోతాయని డాక్టర్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రౌడీ షీటర్‌కు 14 రోజుల రిమాండ్

ధర్మపురి, మే 12 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో దంపతులను బెదిరించి, ఇంటి వద్ద ఆస్తులు ధ్వంసం చేసిన కేసులో రౌడీ షీటర్ తోకల గంగాధర్(38)ను ధర్మపురి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 8న గ్రామానికి చెందిన సంబేట నర్సయ్య భార్య లక్ష్మి బర్రెలకు మేత వేయడానికి వెళ్తుండగా గంగాధర్ ఆమెను అడ్డుకుని బీరు సీసాతో బెదిరించాడు. అనంతరం రాత్రి సమయంలో తన భార్యతో కలిసి నర్సయ్య ఇంటి వద్దకు వెళ్లి తలుపులు పగలగొట్టేందుకు ప్రయత్నించి, కరెంటు మోటార్‌తో పాటు ఇతర వస్తువులను ధ్వంసం చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని ధర్మపురి ఫస్ట్ క్లాస్ జ్యూడిషల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై జి. మహేష్ తెలిపారు. అనంతరం నిందితుడిని జగిత్యాల జైలుకు తరలించారు.




# ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి: సంజయ్

జగిత్యాల, మే 12: పదవ తరగతిలో ఫెయిల్ అయినంత మాత్రాన విద్యార్థులు నిరాశకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ ధరూర్ క్యాంప్ పాఠశాలలో పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాను కూడా పదవ తరగతిలో రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, ఆత్మవిశ్వాసంతో తిరిగి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించి, ప్రస్తుతం వైద్యుడిగా, ఎమ్మెల్యేగా ప్రజల ముందున్నానని తెలిపారు. విద్యార్థులు కూడా ప్రత్యేక శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎంఈఓ చంద్రకళ, గ్రామీణ ఎంఈఓ గంగాధర్, ప్రధానోపాధ్యాయులు అమర్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేత నిత్యానందరెడ్డికి 14 రోజుల రిమాండ్

కడప, మే 13 (ఈవార్తలు): కడప జిల్లా రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పెద్ద దస్తగిరి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేత నిత్యానందరెడ్డికి న్యాయస్థానం రిమాండ్ విధించింది. పెద్ద దస్తగిరి హత్య కేసులో అరెస్టయిన వైసీపీ నేత నిత్యానందరెడ్డిని పోలీసులు ఈరోజు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయస్థానం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయన్ని కడప సెంట్రల్ జైలుకు తరలించారు. కడప జిల్లాలో కీలక నేతగా ఉన్న నిత్యానందరెడ్డి అరెస్ట్, రిమాండ్ ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఫ్యాక్షన్ రాజకీయాలు, పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందా అనే కోణంలో చర్చ సాగుతోంది. ఈ కేసు తదుపరి విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)


Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com





# కష్టాల కడలిలో సింగిల్ స్క్రీన్లు

తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తెలుగు స్టార్ హీరోలకు, నిర్మాతలకు ఒక కీలక విన్నపాన్ని అందించింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా పాత కాలపు అద్దె పద్ధతికి స్వస్తి పలికి.. పర్సంటేజ్ షేరింగ్ (శాతాల ప్రాతిపదికన పంపకం) విధానాన్ని అమలు చేయాలని వారు కోరుతున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రిలీజ్ చేసిన నోట్ లో పలు అంశాలను పేర్కొన్నారు. పర్సంటేజ్ షేరింగ్ విధానం థియేటర్ల మనుగడకు అత్యవసరమని అసోసియేషన్ నొక్కి చెప్పింది. ప్రస్తుతం పరిశ్రమలో నిర్మాతలు ఏడాదిలో దాదాపు 40 వారాల పాటు ఈ పర్సంటేజ్ షేరింగ్ విధానాన్నే అనుసరిస్తున్నారు. అయితే పెద్ద హీరోల సినిమాలు విడుదలయ్యే మిగిలిన 10 వారాల్లో మాత్రం సింగిల్ స్క్రీన్లపై పాత పద్ధతిని విధిస్తున్నారు. ఈ విధానం వల్ల థియేటర్ యాజమాన్యాలకు నష్టం కలుగుతోంది కాబట్టి ఆ 10 వారాల్లో కూడా అదే పర్సంటేజ్ విధానాన్ని వర్తింపజేయాలని ఎగ్జిబిటర్లు కోరుతున్నారు. నేటి కాలంలో థియేటర్లలో సినిమాల ప్రదర్శన సమయం భారీగా తగ్గింది. గతంలో సినిమాలు వారాల తరబడి ఆడేవి.. కానీ ఇప్పుడు భారీ చిత్రాలు కూడా కొద్ది రోజుల్లోనే గరిష్ట వసూళ్లను సాధిస్తున్నాయి. ఉదాహరణకు ఎఫ్2 వంటి చిత్రాలు 8 వారాలు ఆడితే.. ఇటీవల వచ్చిన ధురంధర్ వంటి సినిమాలు కేవలం రెండు మూడు వారాలకే పరిమితమవుతున్నాయి. ప్రేక్షకులు తక్కువ సమయంలోనే ఎక్కువ థియేటర్లలో సినిమా చూస్తుండటం వల్ల అద్దె మోడల్ థియేటర్లకు భారంగా మారింది. మల్టీప్లెక్స్ థియేటర్లు ఇప్పటికే ఈ పర్సంటేజ్ షేరింగ్ లాభాలను పొందుతుండగా.. సమానమైన వసూళ్లు రాబట్టే సింగిల్ స్క్రీన్లను మాత్రం పక్కన పెట్టడం వివక్షతో కూడుకున్నదని అసోసియేషన్ వాదిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో పుష్ప వంటి భారీ చిత్రాలకు సింగిల్ స్క్రీన్లకు షేరింగ్ ఇచ్చారని కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే ఈ అన్యాయమైన వ్యత్యాసం కనిపిస్తోందని పేర్కొన్నారు. కోవిడ్ అనంతర పరిస్థితుల్లో పాత అద్దె పద్ధతిని కొనసాగించడం అటు నిర్మాతలకు, ఇటు ఎగ్జిబిటర్లకు ఇబ్బందికరంగా మారింది. ఈ నూతన పర్సంటేజ్ మోడల్ అనేది పరిశ్రమలో రిస్క్ తో పాటు లాభాలను సమానంగా పంచుకునే ఒక విన్-విన్ పద్ధతి అని అసోసియేషన్ అభిప్రాయపడింది. సింగిల్ స్క్రీన్ థియేటర్ల వారసత్వాన్ని కాపాడుకోవడానికి .. పరిశ్రమను స్థిరంగా ఉంచడానికి అందరూ కలిసి పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.




# మౌనీరాయ్ విడాకులు?

'నాగిని' సీరియల్‌తో దేశ వ్యాప్తంగా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మౌనీ రాయ్. సీరియల్స్‌లో ఒకానొక సమయంలో అత్యధిక పారితోషికం అందుకున్న నటిగా మౌనీ రాయ్ నిలిచింది. ఆకట్టుకునే రూపంతో పాటు, చక్కని నటన మౌనీరాయ్ ను అత్యున్నత స్థాయికి తీసుకు వెళ్లాయి. అందుకే మౌనీ రాయ్ సినిమాల్లోనూ ఆఫర్లు సొంతం చేసుకుంది. నటిగా బిజీగా ఉన్న సమయంలోనే మౌనీ రాయ్ ప్రేమలో పడింది. 2019లో బిజినెస్ మెన్ సూరజ్ తో మోనీ కి పరిచయం అయ్యింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరు దాదాపుగా మూడు ఏళ్ల పాటు ప్రేమలోనే ఉన్నారు. ఇద్దరూ ఒకరి గురించి ఒకరు పూర్తిగా తెలుసుకున్నామని పలు ఇంటర్వ్యూల్లో చెప్పుకొచ్చారు. పెద్దల సమక్షంలో వీరి వివాహం వైభవంగా జరిగింది. 2022లో వీరి వివాహం జరిగింది. పెళ్లి అయిన కొన్నాళ్ల పాటు అంతా సవ్యంగా సాగింది. అయితే గత కొంత కాలంగా వీరి మధ్య విభేదాలు అనే వార్తలు వచ్చాయి. మౌనీ రాయ్ కి హీరోయిన్ దిశా పటానీ మంచి ఫ్రెండ్ అనే విషయం తెల్సిందే. ఇద్దరి మధ్య స్నేహంకు మించిన అనుబంధం ఉందని బాలీవుడ్‌లో అనుకుంటారు. అలాంటి దిశా పటానీ సైతం ఇన్నాళ్లు మౌనీరాయ్ భర్త సూరజ్ ను ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అవుతూ వచ్చింది. ఇటీవల సూరజ్ ను మౌనీరాయ్ అన్ ఫాలో చేయడం, ఆ వెంటనే దిశా పటానీ సైతం ఆయన్ను ఇన్‌స్టాలో అన్ ఫాలో చేయడం జరిగింది. దీంతో ఇద్దరి మధ్య గ్యాప్ చాలా వచ్చిందని, దాన్ని కలిపే అవకాశం లేనట్లే అని బాలీవుడ్ వర్గాల వారు అంటున్నారు.

# మళ్లీ శంబాల కాంబో!



బాక్సాఫీస్ వద్ద సెన్సేషనల్ హిట్ కొట్టిన 'శంబాల' కాంబినేషన్ మళ్లీ రిపీట్ కాబోతోంది. యంగ్ హీరో ఆది సాయికుమార్ షైనింగ్ పిక్చర్స్ నిర్మాతలు మరో వినూత్నమైన ప్రయోగానికి సిద్ధమయ్యారు. ఈసారి భయం, ఉత్కంఠకు తోడు అన్‌లిమిటెడ్ ఎంటర్టైన్మెంట్ పంచేందుకు ఒక సరికొత్త హారర్ డ్రామాతో మనముందుకు వస్తున్నారు. తాజాగా విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఇక 'శంబాల' సినిమాతో ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు ఇప్పుడు ఆదితో రెండో ప్రాజెక్ట్ మొదలుపెట్టారు. ఇక యుగంధర్ ముని సమర్పణలో షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమా నిర్మితమవుతోంది. గత సినిమా ఇచ్చిన బూస్ట్‌తో, ఈసారి మరింత పకడ్బందీగా, విభిన్నమైన కథాంశంతో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి టీమ్ మొత్తం రెడీ అయిపోయింది. ఈ కొత్త సినిమా కాన్సెప్ట్ పోస్టర్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఇందులో ఆది సాయికుమార్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తుండగా.. రక్తం కారుతున్న తీరు, చుట్టూ ఉన్న పువ్వులు, పాతకాలం నాటి స్టాంప్ వంటి ఎలిమెంట్స్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. చూస్తుంటే ఈసారి ఆది మనల్ని ఏదో తెలియని ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకువెళ్లేలా కనిపిస్తున్నాడు. ఈ చిత్రానికి బృందా రవీందర్ దర్శకత్వం వహిస్తున్నారు. కేవలం హారర్ మాత్రమే కాకుండా, బలమైన ఎమోషన్స్ కూడా ఈ సినిమాలో ఉండబోతున్నాయట. ఇక ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకు చూడని ఒక కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను అందించబోతున్నామని చిత్ర బృందం నమ్మకంగా చెబుతోంది. హారర్ ఎలిమెంట్స్‌ని సరికొత్త కోణంలో చూపించడమే ఈ సినిమా ప్రధాన ఉద్దేశం.



# హీరోల బాటలో రకుల్

ఒకప్పుడు హీరోలు తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకొని.. ఆ తర్వాత యూటర్న్ లో భాగంగా విలన్ గా ప్రేక్షకులను మెప్పిస్తున్న విషయం తెలిసిందే.. ఈ క్రమంలోనే గ్లామర్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ తన కెరీర్‌లో అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఎప్పుడూ చిలిపి పాత్రలు, గ్లామరస్ రోల్స్‌తో అలరించే ఈ భామ, ఇప్పుడు ఏకంగా రామాయణంలో 'శూర్పణఖ'గా నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలో కనిపించబోతోంది. నితేష్ తివారీ ప్రతిష్టాత్మక చిత్రంలో రకుల్ చేస్తున్న ఈ ప్రయోగం చూస్తుంటే, ఆమె మరో రమ్యకృష్ణలా పవర్‌ఫుల్ విలనిజం పండించబోతోందని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఇండియన్ బిగ్గెస్ట్ మూవీ 'రామాయణ'లో రకుల్ ప్రీత్ సింగ్ ఎంట్రీ ఖరారైందనే వార్త ఫిల్మ్ నగర్‌లో సెన్సేషన్ సృష్టిస్తోంది. ఈ సినిమాలో రావణాసురుడి సోదరి శూర్పణఖ పాత్రను రకుల్ పోషించబోతుందట. ఎప్పుడూ కమర్షియల్ సినిమాల్లో మెరిసే రకుల్, కథను మలుపు తిప్పే ఇలాంటి క్లిష్టమైన పాత్రను ఎంచుకోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. గతంలో రమ్యకృష్ణ వంటి వారు నెగిటివ్ టచ్ ఉన్న పాత్రలు చేసి తమ నట విశ్వరూపాన్ని చూపించారు. ఇప్పుడు రకుల్ కూడా అదే బాటలో నడుస్తోంది. హీరోయిన్ అంటే కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటనకు ఆస్కారమున్న నెగటివ్ షేడ్స్ కూడా చేయగలనని ఆమె నిరూపించుకోవాలని చూస్తోంది. ఈ పాత్ర కనుక క్లిక్ అయితే, రకుల్ కెరీర్ గ్రాఫ్ పూర్తిగా మారిపోవడం ఖాయం. ఈ సినిమాలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. కన్నడ రాకింగ్ స్టార్ యష్ రావణాసురుడిగా కనిపించబోతుండగా, ఆయనకు సోదరిగా రకుల్ తన పెర్ఫార్మెన్స్‌తో పోటీ పడనుంది. ఇక యష్, రకుల్ కాంబినేషన్ వెండితెరపై ఎలా ఉంటుందోనని అభిమానులు ఇప్పటి నుంచే ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.

# నెటిజన్‌కు సీరత్ క్లాస్!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, బ్యూటీ సీరత్ కపూర్ మధ్య ఉన్న ఫ్రెండ్ షిప్ పై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చలు మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. రీసెంట్ గా బన్నీ పుట్టినరోజు సందర్భంగా సీరత్ షేర్ చేసిన ప్రైవేట్ జెట్ ఫోటోలు, వాటిపై వచ్చిన కామెంట్లు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా ఓ నెటిజన్ చేసిన అసభ్యకర కామెంట్ కు సీరత్ ఇచ్చిన ఘాటు సమాధానం నెట్టింట వైరల్ అవుతోంది. ఇటీవల అల్లు అర్జున్ తన 44వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఆ సందర్భంగా సీరత్ కపూర్ సోషల్ మీడియాలో బన్నీతో కలిసి ప్రైవేట్ జెట్ లో దిగిన కొన్ని అ న్‌సీన్ ఫోటోలను షేర్ చేస్తూ ప్రత్యేకంగా విషెస్ తెలిపింది. "హ్యాపీ బర్త్ డే బన్నీ.. మీరు మీ కళను, సంబంధాలను ఎంతో సహజంగా, హుందాగా బ్యాలెన్స్ చేస్తారు. తెరపై, తెర వెనుక మరిన్ని విజయాలు అందుకోవాలి" అంటూ ఆమె పోస్ట్ చేసింది. చివర్లో లవ్ సింబల్ కూడా యాడ్ చేసింది. అయితే సీరత్ కపూర్ పోస్ట్ పెట్టిన తర్వాత సోషల్ మీడియాలో వీరిద్దరి మధ్య రిలేషన్ ఉందంటూ కొందరు నెటిజన్లు ఊహాగానాలు మొదలుపెట్టారు. తాజాగా సీరత్ తన ఇన్ స్టాగ్రామ్ లో మరో ఫోటో షేర్ చేయగా, ఓ నెటిజన్ లిమిట్స్ క్రాస్ చేసి అల్లు అర్జున్ ప్రాపర్టీ అంటూ కామెంట్ చేశాడు. ఆ కామెంట్ పై ఇప్పుడు సీరత్ ఫుల్ ఫైర్ అయ్యి గట్టి క్లాస్ పీకారు. "చివర్లో హార్ట్ ఎమోజీ పెట్టినంత మాత్రాన మీరు చెప్పిన మాటలు గౌరవప్రదంగా మారిపోవు సార్. ఒక మహిళ ఎప్పటికీ ఎవరి ఆస్తి కాదు. ఆమెకు తనకంటూ వ్యక్తిత్వం, కలలు, స్వరం ఉంటాయి. గౌరవించడం నేర్చుకోండి. కానీ ఇలా ప్రాపర్టీ రైట్స్ ఉన్నట్లు మాట్లాడొద్దు" అంటూ ఆమె స్ట్రాంగ్ రిప్లై ఇచ్చారు.

# హాలీవుడ్ బాటలో భారత నటీమణులు



ఛాన్స్ రావాలే గానీ ప్రపంచంలో ఏ భాషలోనైనా నటించడానికి భారతీయ నటీమణులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. అవకాశం వస్తే వెళ్లడానికి హీరోలు ఆలోచిస్తారేమో గానీ హీరోయిన్లు మాత్రం కళ్లు మూసుకుని బోర్డర్ దాటేస్తుంటారు. ఇప్పటికే ప్రియాంక చోప్రా, దీపికా పదుకొనే, ఆలియా భట్ వంటి అగ్ర కథానాయికలు హాలీవుడ్ తెరపై మెరిసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ జాబితాలోకి మరో గ్లామర్ బ్యూటీ దిశా పటానికి చేరుతుంది. తన విలక్షణమైన నటనతో అద్భుతమైన ఫిట్‌నెస్‌తో ప్రేక్షకులను అలరించిన అమ్మడు ఇప్పుడు హాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతోంది. అమ్మడు తన అంతర్జాతీయ ప్రయాణాన్నిది పోర్టల్ ఆఫ్ ఫోర్స్ అనే భారీ ప్రాజెక్టుతో ప్రారంభిస్తుంది. ఇదొక హై-యాక్షన్ , సైన్స్ ఫిక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్నట్లు సమాచారం. సాధారణంగా బాలీవుడ్ సినిమాల్లో గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దిశా హాలీవుడ్ చిత్రంలో మాత్రం నటనకు, యాక్షన్ సన్నివేశాలకు ప్రాధాన్యత ఉన్న పాత్రను పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం అమ్మడు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ కూడా తీసుకుందని తెలిసింది. భారతీయ నటి హాలీవుడ్ వరకు వెళ్లడం అనేది ఆమె వ్యక్తిగత విజయం మాత్రమే కాదు. ఇలాంటి అచీవ్ మెంట్స్ భారతీయ సినిమా ఎదుగుదలకు నిదర్శనం. గతంలో ప్రియాంక చోప్రా క్వాంటికో, బేవాచ్ చిత్రాలతో గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన సంగతి తెలిసిందే. అటుపై దీపికా పదుకొణె ట్రిపుల్ ఎక్స్ సిరీస్‌తో హాలీవుడ్ లో అలరించారు. ఆలియా భట్ సైతం హార్ట్ ఆఫ్ స్టోన్ మూవీతో హాలీవుడ్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. దిశా పాట్నీ కూడా అదే బాటలో పయనిస్తూ అంతర్జాతీయ స్థాయిలో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకోవాలని ఆశిస్తుంది. దిశా పాట్నీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ అంతర్జాతీయ ప్రాజెక్టుకు ప్లస్ పాయింట్‌గా మారనుంది. సొగసరి ఫిట్‌నెస్ వీడియోలు ,మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలు హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్లను ఇంప్రెస్ చేసినట్లు సమాచారం. ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్ సినిమాలో ఆమె స్వయంగా కొన్ని రిస్కీ స్టంట్స్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. అక్కడ తన నటనను నిరూపించుకోవడమే కాక భారతీయ నటీమణులు ఏ విధమైన కఠినమైన పాత్రలనైనా పోషించగలరని ప్రపంచానికి చాటి చెప్పడమే తన లక్ష్యమని ఓ సందర్భంలోనూ ఓపెన్ అయింది. ప్రస్తుతం భారతీయ నటీమణులకు హాలీవుడ్‌లో మంచి అవకాశాలొస్తున్నాయి.





# టపటపా వికెట్లు

## సన్‌రైజర్స్ ఘోరపరాజయం

### 86 పరుగులకే ఆలౌట్.. గుజరాత్ ఘన విజయం.. రాణించిన రబడా, హోల్డర్

**అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను 82 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించింది. 169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్.. గుజరాత్ బౌలర్ల ధాటికి 14.5 ఓవర్లలో కేవలం 86 పరుగులకే కుప్పకూలింది. ఛేదనలో సన్‌రైజర్స్ ఆది నుంచే వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ డకౌట్‌గా వెనుదిరగడంతో మొదలైన పతనం ఏ దశలోనూ ఆగలేదు.**

కగిసో రబడా (3/28), జాసన్ హోల్డర్ (3/20) నిప్పులు చెరిగే బంతులతో హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు తీయగా, సిరాజ్ ఒక వికెట్ పడగొట్టాడు. హైదరాబాద్ జట్టులో కెప్టెన్ పాట్ కమిన్స్ (19) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (44 బంతుల్లో 61), వాషింగ్టన్ సుందర్ (33 బంతుల్లో 50) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఆరంభంలో కెప్టెన్ గిల్ సహా కీలక వికెట్లు త్వరగా కోల్పోయినా, వీరిద్దరి భాగస్వామ్యాలు గుజరాత్‌ను ఆదుకున్నాయి. హైదరాబాద్ బౌలర్లలో ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ రెండేసి వికెట్లు తీశారు. మొత్తంగా బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన గుజరాత్ ఈ సీజన్‌లో మరో కీలక విజయాన్ని నమోదు చేసుకుంది.

#### గుజరాత్ బౌలర్లకే క్రెడిట్: కమిన్స్

గుజరాత్ టైటాన్స్ బౌలర్లు అద్భుత ప్రదర్శనతో తమ పతనాన్ని శాసించారని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ అన్నాడు. టీ20 క్రికెట్‌లో ఇంతకంటే అత్యుత్తమ బౌలింగ్‌ను చూసి ఉండమని కొనియాడాడు. 'గుజరాత్ టైటాన్స్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. ప్రత్యర్థిని తక్కువ స్కోర్‌కు కట్టడి చేయడంతో మా బౌలింగ్ తీరు నాకు సంతృప్తినిచ్చింది. కానీ ఈ వికెట్ బ్యాటింగ్‌కు కష్టంగా ఉంది. గుజరాత్ బౌలర్లు పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లు బౌలింగ్ చేశారు. ఇలాంటి క్లిష్టమైన స్పెల్స్‌ను ఎలా ఎదుర్కోవాలో మేం ఆలోచించాలి. అయితే ఈ గెలుపు క్రెడిట్ పూర్తిగా గుజరాత్ టైటాన్స్ బౌలర్లదే. మేం ఎప్పుడూ మా లోపాలను సరిదిద్దుకోవాలని చూస్తాం. ఈ మ్యాచ్‌లో బ్యాక్ ఆఫ్ ది లెంగ్త్‌లో వేసినప్పుడు బ్యాటర్లకు పరుగులు తీయడం కష్టంగా మారింది. గుజరాత్ బౌలర్లు మాకు పరుగులు చేసే అవకాశమే ఇవ్వలేదు. వారి బౌలింగ్ చేసిన తర్వాత మేం ఇంకాస్త మెరుగ్గా బౌలింగ్ చేయాల్సిందని అనిపించింది. వారి బౌలింగ్ నుంచి మేం పాఠాలు నేర్చుకోవాలి. ఇంకాస్త మెరుగైన లెంగ్త్‌లో బౌలింగ్ చేయాల్సింది. ఏది ఏమైనా టీ20 క్రికెట్‌లో ఇంతకంటే అత్యుత్తమ బౌలింగ్‌ను చూసి ఉండం. మా బ్యాటింగ్ ఆర్డర్ అద్భుతంగా ఉంది. కాబట్టి ఈ ఒక్క మ్యాచ్ ఫలితాన్ని బట్టి మేం అతిగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా టాప్ ఫోర్ బ్యాటర్లందరూ ఈ సీజన్‌లో 400 కంటే ఎక్కువ పరుగులు చేశారు. వారంతా మంచి ఫామ్‌లో ఉన్నారు. టీ20 క్రికెట్‌లో ఇలాంటి ఫలితాలు అప్పుడప్పుడు ఎదురవుతుంటాయి. మాకు బాగా తెలిసిన వేదికల్లోనే తర్వాతి మ్యాచ్‌లు ఉన్నాయి. కాబట్టి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతాం. ప్లే ఆఫ్స్ క్వాలిఫికేషన్ గురించి ఎలాంటి ఆందోళన లేదు. ఈ టోర్నీ ఆరంభంలోనే ఎక్కువ విజయాలు సాధించడం ముఖ్యం. మేం గత ఏడు మ్యాచ్‌ల్లో ఐదు లేదా ఆరు గెలిచాం. అది మాకు ప్లేఆఫ్ రేసులో కొంచెం ఊరటనిస్తుంది. క్వాలిఫై అవ్వడానికి మాకు ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. మేం గతంలో ఏ వ్యూహాలతో గెలిచామో వాటిపైనే మళ్లీ దృష్టి పెడతాం. ఈ ఓటమిని త్వరగా మర్చిపోయి తదుపరి మ్యాచ్‌లకు సిద్ధమవుతాం.'అని పాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు.



## టాక్ ఆఫ్ ది టోర్నీగా ధోనీ

టీమిండియా దిగ్గజ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ప్లేయర్ మహేంద్ర సింగ్ ధోనీ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై 6 ఏళ్లు గడుస్తున్నా.. ధోనీపై అభిమానం ఇసుమంత కూడా తగ్గలేదు. ఇప్పటికీ చెన్నై సూపర్ కింగ్స్ ఆడే మ్యాచ్‌లకు మైదానాలన్నీ పసుపుమయం అవుతున్నాయంటే దానికి ప్రధాన కారణం ధోనీనే అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. దురదృష్టవశాత్తు గాయం కారణంగా ధోనీ ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ ఆడలేదు. అయినా ధోనీ టాక్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సోషల్ మీడియా వేదికగా అత్యంత ఎక్కువగా మాట్లాడుకున్న క్రికెటర్ల జాబితాను అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ వెల్లడించింది. మార్చి 28 నుంచి మే 12 వరకు ఉన్న డేటాను పరిగణలోకి తీసుకొని ఈ జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలో ఆర్‌సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో ఉండగా.. మహేంద్ర సింగ్ ధోనీ రెండో స్థానంలో నిలిచాడు. ముంబై ఇండియన్స్ స్టార్ రోహిత్ శర్మ, చెన్నైసూపర్ కింగ్స్ ఓపెనర్ సంజూ శాంసన్, ఢిల్లీ బ్యాటర్ కేఎల్ రాహుల్ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ పేరు ఈ జాబితాలో లేదు. ఈ సీజన్‌లో తనదైన దూకుడు బ్యాటింగ్‌తో అభిమానులను ఆకట్టుకున్న వైభవ్ సూర్యవంశీ 36 బంతుల్లోనే సెంచరీ బాదాడు. అంతేకాకుండా 15 బంతుల్లోనే రెండు సార్లు హాఫ్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. వరల్డ్ బెస్ట్ పేసర్ల బౌలింగ్‌లో తొలి బంతినే బౌండరీకి తరలించాడు. అలాంటి వైభవ్ సూర్యవంశీ పేరు ఈ జాబితాలో లేకపోవడం అందర్నీ విస్మయ పరుస్తుంది. ఈ టోర్నీలో కోహ్లీ గురించి 44 శాతం మంది మాట్లాడుకోగా.. ధోనీ గురించి 21 శాతం, రోహిత్ శర్మ 18 శాతం, సంజూ శాంసన్(10 శాతం), కేఎల్ రాహుల్ 8శాతం చర్చించారు.

## కోహ్లీపై కుట్రలకు ప్లాన్

**జర్మన్ మోడల్ లిజ్‌లాజ్**



కోహ్లీ తన ఇన్‌స్టా ఫొటోకు లైక్ కొట్టిన తర్వాత తనను కొందరు జర్నలిస్టులు సంప్రదించారని జర్మన్ మోడల్, సింగర్ లిజ్‌లాజ్ బాంబు పేల్చింది. కోహ్లీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేయాలని, అతను తనకు పర్సనల్ మెసేజ్‌లు చేస్తున్నట్లు అబద్ధాలు చెప్పాలని వారు కోరారని వెల్లడించింది. ఇందుకు గానూ ఆమెకు భారీగా డబ్బు కూడా ఆఫర్ చేశారట. అయితే విరాట్ పట్ల ఉన్న గౌరవం,తన విలువలకు కట్టుబడి ఆ ఆఫర్లను తాను తిరస్కరించానని ఆమె స్పష్టం చేసింది. డబ్బు కోసం ఒక వ్యక్తి జీవితాన్ని నాశనం చేయడం తన వల్ల కాదని ఆమె తన ఇంటర్వ్యూలో తెగేసి చెప్పింది. లిజ్‌లాజ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా షేర్ అవుతున్నాయి. విరాట్ కోహ్లీని టార్గెట్ చేసేందుకు కొంతమంది ఎంత నీచానికి ఒడిగడుతున్నారో ఈ ఘటన ద్వారా అర్థమవుతోందని కోహ్లీ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. ఒక అంతర్జాతీయ స్థాయి ఆటగాడిపై ఇలాంటి పెయిడ్ క్యాంపెయిన్స్ నిర్వహించడం సిగ్గుచేటని క్రికెట్ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. జర్మనీకి చెందిన లిజ్‌లాజ్ (అసలు పేరు జెన్నిఫర్) కేవలం మోడల్ మాత్రమే కాదు, ఆమె ఎంతో ప్రతిభావంతురాలు. ఆమె సైకాలజీలో మాస్టర్స్ పూర్తి చేసింది. జర్మన్, డచ్, ఫ్రెంచ్ వంటి ఐదు భాషల్లో పట్టున్న ఆమెకు భారతీయ సంస్కృతి అన్నా, ఆహారం అన్నా చాలా ఇష్టం. ముఖ్యంగా విరాట్ కోహ్లీకి, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ఆమె పెద్ద అభిమాని. ఈ వివాదం తర్వాత కూడా ఆమె ఆర్‌సీబీ జెర్సీ ధరించి కోహ్లీకి మద్దతు తెలుపుతూ పోస్ట్‌లు చేయడం విశేషం.

## వావ్రింకా వైల్డ్ కార్డ్ ఎంట్రీ

**రసవత్తరంగా ఫ్రెంచ్ ఓపెన్**

మట్టికోర్టు పోరాటాలకు నెలవైన ఫ్రెంచ్ ఓపెన్‌కు మరో ఆరు రోజులే ఉంది. ఇప్పటికే టాప్ సీడ్స్ జన్నిక్ సిన్నర్, జ్వెరెవ్, స్వియాటెక్‌లు తమవైన వ్యూహాలతో బిజీగా ఉండగా.. టోర్నీని మరింత ఆసక్తిగా మార్చేందుకు నిర్వాహకులు వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఖరారు చేశారు. మాజీ ఛాంపియన్ స్టాన్ వావ్రింకా, ఒకప్పుటి సెమీస్ ఆడిన గేల్ మోన్‌ఫిల్స్‌కు ఆడే అవకాశమిచ్చింది. మహిళల విభాగంలో ఎనిమిది మంది వైల్డ్ కార్డ్ ఎంట్రీతో ఫ్రెంచ్ ఓపెన్ ఆడనున్నారు. రొలాండ్ గరోస్ టోర్నమెంట్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ సాధించిన వెటరన్ వావ్రింకా ప్రస్తుతం 125వ ర్యాంక్. కానీ, ఈ ఈవెంట్లో అతడు గుర్తుండిపోయే ప్రదర్శనలు చేసిందుకు ఈసారి నిర్వాహకులు అవకాశమిచ్చారు. 2015లో క్వార్టర్స్‌లో రోజర్ ఫెదరర్‌ను ఓడించిన ఉత్సాహంతో.. ఫైనల్లో నొవాక్ జకోవిచ్‌ను చిత్తు చేసి టైటిల్ కొల్లగొట్టాడీ స్విట్జర్లాండ్ స్టార్. గేల్ విషయానికొస్తే.. ఈ ఫ్రెంచ్ ఆటగాడు 2008లో సెమీస్ వరకూ వెళ్లాడు. కానీ, ఫెదరర్ జోరుకు నిలవలేక చేతులెత్తేశాడు. వావ్రింకా, గేల్‌తో పాటు పురుషుల విభాగంలో, మహిళల విభాగలో పలువురు వైల్డ్ కార్డ్ ఎంట్రీ దక్కించుకున్నారు. పురుషుల వైల్డ్ కార్డ్ జాబితాలో.. నిశేష్ బసవరెడ్డి, టిటౌన్ డ్రొగుట్, హుగో గస్టన్, అర్థర్ జీ, మోయిస్ కౌమె, ఆడమ్ వాల్టన్ ఉన్నారు. మహిళల విభాగంలో క్లారా బురెల్, సెనియా ఎఫ్రెమోవా, ఫియోనా ఫెర్రో, లియోలియా జీన్‌జీన్, ఎమెర్సన్ జోన్స్, సరాహ్ రకొటొమంగ, అలిసే తుబెల్లో, ఆకాశ ఉర్హోబోలు వైల్డ్ కార్డ్ ఎంట్రీ సాధించారు. పురుషుల సింగిల్స్‌లో జనిక్ సిన్నర్, అలెగ్జాండర్ జ్వెరెవ్, నొవాక్ జకోవిచ్, ఫెలిక్స్ అగర్ అలిస్సిమెలు టాప్ సీడ్స్‌గా పోటీ పడుతున్నారు. మహిళల విభాగంలో ఇగా స్వియాటెక్, ఎలెనా రిబాకీనాలు టైటిల్ లక్ష్యంగా ఆడనున్నారు. మే 18 నుంచి జూన్ 7 వరకూ ఫ్రెంచ్ ఓపెన్ జరుగనుంది.



## పాక్‌కు భంగపాటు

సొంతగడ్డపై తామెంత ప్రమాదకరమో బంగ్లాదేశ్ జట్టు మరోసారి నిరూపించింది. తొలి టెస్టులో పాకిస్థాన్ బ్యాటర్లను వణకిస్తూ భారీ విజయాన్నందుకుంది. 'దమ్ముంటే మా ముందు దమ్ముంటే మా ముందు 70 ఓవర్లలో 260పైగా లక్ష్యాన్ని నిర్దేశించండి' అని సవాల్ విసిరిన సల్మాన్ అఘా తల పొగరను అణచివేస్తూ రెండు టెస్టుల సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది. మొదటి ఇన్నింగ్స్‌లో కాస్తో కూస్తో పోరాడిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కుప్పకూలింది. నహిద్ రానా (5-40) బంతితో చెలరేగిన వేళ బంగ్లా 104 పరుగుల తేడాతో గెలుపొందింది. తద్వారా స్వదేశంలో పాక్‌పై బంగ్లాదేశ్ మొదటి విజయంతో చరిత్ర సృష్టించింది. ఢాకా టెస్టులో ఆతిథ్య బంగ్లాదేశ్ ధాటికి పాకిస్థాన్ నిలువలేకపోయింది. 268 పరుగుల స్వల్ప ఛేదనలో బ్యాటర్ల వైఫల్యంతో పాక్ కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో నహిద్ రానా(5-40) ఐదు వికెట్లతో బంగ్లాదేశ్ విజయంలో కీలకమయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో పట్టుదలగా ఆడిన పాక్ ఆటగాళ్లు ఏమొందో ఏమో రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం తేలిపోయారు. టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన చోట అబ్దుల్లా ఫజల్(66) ఒక్కడే అర్ధ శతకంతో పోరాడాడు. కానీ, నహిద్ సంచలన స్పెల్‌తో పాక్ పతనాన్ని శాసించాడు. తొలి ఇన్నింగ్స్ శతకంతో.. రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీతో మెరిసిన బంగ్లా కెప్టెన్ శాంటో ' ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న నజ్ముల్ హుసేన్ శాంటో(103) సెంచరీతో కదం తొక్కాడు. సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం(71) మెరుపులతో బంగ్లాదేశ్ భారీ స్కోర్ దిశగా సాగింది. కానీ, మొహమ్మద్ అబ్బాస్(92-5) ఐదు వికెట్లు తీసి బంగ్లాను 413కే పరిమితం చేశాడు. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన పాక్ కూడా దీటుగానే బదులిచ్చింది. ఓపెనర్ అజాన్ అవైస్(103), అబ్దుల్లా ఫజల్(87), సల్మాన్ అఘా(58), మహమ్మద్ రిజ్వాన్(59)లు అర్ధ శతకాతో రాణించినా.. మెహిదీ హసన్ మిరాజ్(5-102) ధాటికి 386కే ఆలౌటయ్యింది. రెండో ఇన్నింగ్స్‌లో శాంటో అర్ధ శతకంతో ఆదుకోగా బంగ్లా 9 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఇరుజట్ల మధ్య మే 16 నుంచి రెండో టెస్టు జరుగనుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 13-5-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# మానవ సంబంధాలు.. సాంకేతిక బంధాలు

ప్రస్తుత ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం (టెక్నాలజీ) మన దైనందిన జీవితంలో ఒక అనివార్య భాగం అయిపోయింది. స్మార్ట్‌ఫోన్‌లు, హై-స్పీడ్ ఇంటర్నెట్, కృత్రిమ మేధస్సు వంటి ఆవిష్కరణలు మానవ జీవన విధానాన్ని పూర్తిగా మార్చివేశాయి. ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా మార్చిన ఈ డిజిటల్ విప్లవం, మనకు ఎన్నో సౌకర్యాలను అందించినప్పటికీ, మానవ సంబంధాల విషయంలో మాత్రం కొన్ని తీవ్రమైన సవాళ్లను విసురుతోంది. ఇంటర్నెట్ సహాయంతో ప్రపంచంలోని ఏ మూలలో ఉన్నవారితోనైనా క్షణాల్లో కనెక్ట్ అవ్వగలుగుతున్నాం. కానీ, అదే సమయంలో మన పక్కన ఉన్నవారితో మాట్లాడటం తగ్గించేస్తున్నాం. ఒకే గదిలో కూర్చుని కూడా ఎవరి ఫోన్లలో వారు మునిగిపోవడం నేడు సర్వసాధారణం అయిపోయింది. సామాజిక మాధ్యమాలలో వందల మంది స్నేహితులు, లైకులు, కామెంట్లు ఉంటున్నాయి. అయితే, కష్ట సమయంలో పక్కన నిలబడే నిజమైన స్నేహాలు, ఆత్మీయతలు కరువవుతున్నాయి. భౌతిక సంభాషణలు తగ్గిపోవడం వల్ల మనుషుల మధ్య ఎమోషనల్ బాండింగ్ (భావోద్వేగ బంధం) బలహీనపడుతోంది. నిరంతరం డిజిటల్ స్క్రీన్లకు అతుక్కుపోవడం వల్ల ఒంటరితనం, నిరాశ, నిద్రలేమి వంటి సమస్యలు యువతలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇతరుల ఆన్‌లైన్ జీవితాలను చూసి తమ జీవితాలతో పోల్చుకుంటూ అసంతృప్తికి లోనవుతున్నారు. వినోదం పేరుతో గంటల తరబడి సోషల్ మీడియా రీల్స్, వీడియోలు చూస్తూ విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు. ఇది వ్యక్తిగత ఎదుగుదలను మరియు కుటుంబంతో గడిపే సమయాన్ని దెబ్బతీస్తోంది. సాంకేతికత అనేది ఒక అద్భుతమైన సాధనం. దానిని ఎంతవరకు ఉపయోగించాలో అంతవరకే ఉపయోగించినప్పుడు అది మనకు వరంగా మారుతుంది. డిజిటల్ డిటాక్స్ అలవాటు చేసుకోవడం, రోజులో కొంత సమయం ఫోన్లకు దూరంగా ఉండి కుటుంబ సభ్యులతో గడపడం, పిల్లలను మైదానాల్లో ఆటలాడేలా ప్రోత్సహించడం వంటి మార్పులు నేడు అత్యంత అవసరం. సాంకేతికతకు మనం గులాములు కాకుండా, దానిని మన అవసరాలకు మాత్రమే వాడుకుంటూ మానవ సంబంధాలను కాపాడుకున్నప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది.





# విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు



రణధీర్ గుండు

లక్షలాది మంది విద్యార్థుల రక్తాన్ని, చెమటను ధారపోసి చదివే చదువులను వ్యాపార వస్తువులుగా మార్చిన ఘనత నేటి ప్రభుత్వ పెద్దలకే దక్కుతుంది. దేశంలో వైద్య విద్యార్హత కోసం నిర్వహించే నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కావడం కేవలం ఒక పరీక్ష వైఫల్యం కాదు; అది దేశ విద్యావ్యవస్థ నైతిక పతనానికి నిదర్శనం. రాత్రింబవళ్లు కష్టపడి, కంటిమీద కునుకు లేకుండా ప్రిపేర్ అయిన ప్రతిభావంతులైన విద్యార్థుల కలలను కాలరాస్తూ, డబ్బున్న వారికే సీట్లు కట్టబెట్టేలా సాగుతున్న ఈ లీకేజీల దందాపై పాలకులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా, సిగ్గుచేటుగా ఉంది.

ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు కలిసి విద్యార్థుల భవిష్యత్తుతో ప్రమాదకరమైన జూదం ఆడుతున్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల డాక్టర్ కలలను ఈ లీకేజీల మాఫియా చిదిమేస్తోంది. ప్రతిభకు కాకుండా కోట్లాది రూపాయల లంచాలకు ప్రశ్నపత్రాలను అమ్ముకుంటున్నారు. లీకేజీలు బయటపడినప్పుడు కమిటీల పేరుతో కాలయాపన చేయడం పాలకులకు అలవాటుగా మారింది. ఇంత పెద్ద కుంభకోణం జరిగినా ఏ ఒక్క ప్రభుత్వ పెద్ద కూడా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయకపోవడం వారి అహంకారానికి నిదర్శనం. ఈ వ్యవహారంలో తప్పును కప్పిపుచ్చుకునేందుకు పాలకులు ఆడుతున్న నాటకాలు అన్నీ ఇన్నీ కావు. తొలుత అసలు లీకేజీయే జరగలేదని బుకాయించడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి పరాకాష్ట. జాతీయ పరీక్షల సంస్థ లాంటి స్వయంప్రతిపత్తి గల సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ వాటి విశ్వసనీయతను దెబ్బతీశారు. ప్రధాన సూత్రధారులను వదిలేసి, చిన్న చిన్న దళారులను పట్టుకుని చేతులు దులుపుకుంటున్నారు. కోర్టులు మొట్టికాయలు వేసే వరకు ప్రభుత్వాలు స్పందించకపోవడం పాలకుల మొద్దునిద్రను తెలియజేస్తోంది. దేశంలో విద్యా ప్రమాణాలు దిగజారిపోవడానికి, వైద్యరంగంలో నకిలీ మేధావులు తయారవడానికి ఇటువంటి అవినీతి చర్యలే కారణం. లీకేజీల వెనుక ఉన్న అసలైన "పెద్దల" ముసుగులను తొలగించాల్సిన బాధ్యత ఉంది. కేవలం పరీక్షలను రద్దు చేయడం లేదా వాయిదా వేయడం వల్ల విద్యార్థుల మానసిక ఆందోళన పెరుగుతుందే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకదు.

# బీజేపీకి 'దక్షిణ' ప్రతిబంధకాలు



నవీన్ పోగుల

ఉత్తరాది రాజకీయ ముఖచిత్రానికి, దక్షిణాది రాజకీయ ముఖచిత్రానికి మధ్య స్పష్టమైన, లోతైన వైరుధ్యం ఉంది. ఒకే దేశం, ఒకే భావజాలం అనే సూత్రం ఇక్కడ పనిచేయదు. దక్షిణాది రాజకీయాలను అర్థం చేసుకోవడం, ఇక్కడ విజయకేతనం ఎగరేయడం భారతీయ జనతా పార్టీ అనుకుంటున్నంత సులువు కాదు. దక్షిణాది రాష్ట్రాలలో భాష, సంస్కృతి, ప్రాంతీయ అస్తిత్వం చాలా బలమైనవి. హిందీ జాతీయవాదం లేదా ఏకశిలా సంస్కృతి సిద్ధాంతాలు ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని తాకలేవు. తమిళనాడులో ద్రావిడ భావజాలం, ఆంధ్రప్రదేశ్-తెలంగాణలలో తెలుగు ఆత్మగౌరవం రాజకీయాలను శాసిస్తాయి. ఇక్కడి ఓటర్లు కేవలం భావోద్వేగాల ఆధారంగా ఓట్లు వేయరు. సామాజిక న్యాయం, సంక్షేమం, స్థానిక నాయకత్వాల చుట్టూనే ఇక్కడి రాజకీయం తిరుగుతుంది. ఉత్తరాదిలో పనిచేసే 'మతపరమైన ధ్రువీకరణ' వ్యూహాలు దక్షిణాది సరిహద్దులు దాటడం కష్టం. విద్య, వైద్యం, మానవాభివృద్ధి సూచికల్లో దక్షిణాది రాష్ట్రాలు చాలా ముందున్నాయి. కేంద్రం ఇచ్చే నిధుల కంటే, తాము కేంద్రానికి కట్టే పన్నులే ఎక్కువనే భావన ఇక్కడి ప్రజల్లో ఉంది. ఆర్థిక ప్రగతి, సంక్షేమ పథకాల అమలులో స్థానిక పార్టీల ట్రాక్ రికార్డ్ బలంగా ఉంది. బలమైన ప్రాంతీయ క్షేత్రస్థాయి నాయకత్వం ఉంది. దక్షిణాదిలో దశాబ్దాలుగా పాతుకుపోయిన బలమైన ప్రాంతీయ పార్టీలు, క్యాడర్ ఉన్నాయి. ఢిల్లీ కేంద్రంగా సాగే హైకమాండ్ సంస్కృతిని ఇక్కడి ఓటర్లు అంతగా ఇష్టపడరు. స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే బలమైన నాయకులే ఇక్కడ చక్రం తిప్పుతారు. దక్షిణాది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు; అది ఒక విలక్షణమైన రాజకీయ ఆలోచనా సరళి. ఇక్కడి ప్రజల మద్దతు పొందాలంటే కేవలం ఎన్నికల వ్యూహాలు, భారీ ప్రచారాలు సరిపోవు. ఇక్కడి భాషను, సంస్కృతిని, హక్కులను గౌరవిస్తూ, స్థానిక అస్తిత్వంతో మమేకమవ్వడం మాత్రమే ఏకైక మార్గం. అది సాధ్యం కానంతవరకు దక్షిణాది కోటను బద్దలు కొట్టడం బీజేపీకి అసాధ్యమైన టాస్క్ గానే మిగిలిపోతుంది.



# బౌలర్లు బలిపశువులు

వెంకటేశ్ గుగ్గిళ్ల
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్

ఐపీఎల్ తాజా సీజన్లు క్రికెట్ అసలు సిసలు నైజాన్ని మార్చేస్తున్నాయి. మైదానంలో బౌలర్ల పస తగ్గుతోంది. బ్యాటర్ల విధ్వంసం హద్దులు దాటుతోంది. బౌండరీల మోత, సిక్సర్ల వర్షం ప్రేక్షకులకు వినోదాన్ని పంచవచ్చు. కానీ, ఇది ఆట సమతుల్యతను దారుణంగా దెబ్బతీస్తోంది. బౌలింగ్‌ను కేవలం ఒక బంతులు విసిరే ప్రక్రియగా మార్చేయడం క్రికెట్ భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదకరం. 250 పైచిలుకు స్కోర్లు ఇప్పుడు సర్వసాధారణం అయ్యాయి. ఎంతటి మేటి బౌలరైనా సరే ఓవర్‌కు 12 నుండి 15 పరుగులు ఇచ్చుకోవాల్సి వస్తోంది. నిర్వాహకులు కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే సహకరించేలా ఫ్లాట్ పిచ్‌లను సిద్ధం చేస్తున్నారు. ఇంపాక్ట్ ప్లేయర్ వంటి కొత్త నిబంధనలు బ్యాటింగ్ లైనప్‌ను మరింత బలోపేతం చేశాయి. క్రికెట్ అనేది బ్యాట్, బాల్ మధ్య జరిగే సమాన పోరాటం. ఒకప్పుడు బౌలర్ల స్వింగ్, స్పిన్ మాయాజాలం చూసి మురిసిపోయే కాలం ఉండేది. ఇప్పుడు ఆ వైవిధ్యం కరువైంది. యార్కర్లు వేసినా బౌండరీ అవతలికి వెళ్తుండటంతో బౌలర్లలో ఆత్మవిశ్వాసం సడలుతోంది. రాబోయే కాలంలో పిల్లలు ఎవరూ బౌలర్లు కావాలని కోరుకోరు. అంతా బ్యాటర్లు కావాలనే అనుకుంటారు. బౌలర్లు లేని క్రికెట్‌ను ఊహించడం అసాధ్యం. ఈ ప్రమాదం నుండి క్రికెట్‌ను కాపాడటానికి అంతర్జాతీయ క్రికెట్ మండలి, బీసీసీఐ తక్షణ చర్యలు చేపట్టాలి. పిచ్‌ల తయారీలో బౌలర్లకు కూడా అనుకూలత ఉండేలా చూడాలి. బౌండరీల దూరాన్ని పెంచాలి. బౌలింగ్‌ను చిన్నచూపు చూసే నిబంధనలను పునఃసమీక్షించాలి. వినోదం ముఖ్యం, కానీ ఆట ఉనికిని పణంగా పెట్టి కాదు. బ్యాటింగ్, బౌలింగ్‌ల మధ్య సమాన పోరాటం సాగినప్పుడే క్రికెట్‌కు అసలైన అందం, సుదీర్ఘ భవిష్యత్తు ఉంటాయి.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.